జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 5 సంచిక 07 | హైదరాబాద్, అక్టోబరు 28 గురువారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

# పాలమూరు రాజకీయం.. మారుతున్న రంగులు



మహబూబ్ నగర్, అక్టోబరు 27, ప్రజాపాలన ప్రతినిధి:పాలమూరులో రాజకీయం రంగులు మారుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉన్నా ఇప్పటి నుంచే నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు కండువాలు మార్చే పనిలో పడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీఫాం, ఇతర అవకాశాలపై హామీలు తీసుకొని క్యాడర్‌తో సహా చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి, ఆయన సతీమణి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్ రెడ్డి కూడా త్వరలో పార్టీ మారనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో టీడీపీ వైభవాన్ని కోల్పోవడంతో ఇప్పటికే సీనియర్లంతా ఇతర పార్టీలోకి జంప్ అయ్యారు. ఈ నేపథ్యంలో వీరు కూడా పార్టీ మారే అవకాశాలపై సోమవారం అనుచరులతో చర్చించినట్లు తెలిసింది. అయితే ఏ పార్టీలో చేరతారనేదానిపై సస్పెన్స్ నెలకొంది. క్యాడర్‌లో కొందరు కాంగ్రెస్ వైపు చూస్తుండగా.. మరికొందరు వైఎస్సార్ టీపీని ఆప్షన్‌గా సూచించినట్లు సమాచారం. కొత్తకోట దయాకర్‌రెడ్డిది సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం. విద్యార్థి దశ నుంచే లీడర్‌గా ఎదిగిన ఆయన 1987లో ఎన్టీ రామారావు సమక్షంలో టీడీపీలో చేరారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదేపార్టీలో కొనసాగుతున్నారు. పార్టీ తరఫున 1989లో మొదటి సారిగా అమరచింత ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1994లో మరోసారి విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయాడు. 2004 లో టీడీపీ, టీఆర్ఎస్ పొత్తు ఉండగా, టీఆర్ఎస్ అభ్యర్థికి మక్తల్ (మిగతా 2లో..)

# ఇక ప్రలోభాల వంతు!

## హుజూరాబాద్‌లో ముగిసిన ప్రచారం



హుజురాబాద్,అక్టోబరు 27, ప్రజాపాలన ప్రతినిధి: హుజూరాబాద్ ఉప ఎన్నిక సమరంలో కీలకమైన ప్రచార ఘట్టం బుధవారం సాయంత్రం 7 గంటలకు ముగిసింది. కొవిడ్ నిబంధనల ప్రకారం ఈ నెల 30న జరిగే పోలింగ్‌కు 72 గంటల ముందే ప్రచారాన్ని నిలిపివేయాల్సి ఉంది. ఎన్నికలను ప్రధాన పార్టీలైన తెరాస, భాజపా, కాంగ్రెస్‌లు సవాల్‌గా స్వీకరించాయి. బరిలో 30 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ గెల్లు శ్రీనివాస్‌యాదవ్(తెరాస), ఈటల రాజేందర్(భాజపా), బల్మూరి వెంకట్(కాంగ్రెస్)ల తరఫున మూడు పార్టీలు ప్రచారంలో నువ్వా-నేనా అనే తరహాలో పోటీ పడ్డాయి. ఓటర్ల మన్ననల్ని పొందేందుకు చెమటోడ్చాయి.

**తెరవెనుక మంత్రాంగానికి సిద్ధం**

ఇప్పటివరకు ప్రచారంలో ప్రత్యక్షంగా ఓటర్లను మెప్పించిన పార్టీలు ఇకపై తెరవెనుక మంత్రాంగానికి సిద్ధమయ్యాయి. ఓటర్లను ప్రసన్నం చేసేందుకు ఓటుకు ఇంత మొత్తమనేలా నగదు పంపిణీకి రహస్యంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఇప్పటికే మద్యం సీసాలను పలుచోట్ల పంపిణీ చేశారనే ప్రచారం వినిపిస్తోంది. దసరా పర్వదినం సందర్భంగా ఆయా పార్టీలవారు మాంసంతోపాటు మద్యాన్ని విరివిగా పంచారని అంటున్నారు. పోలింగ్‌కు ముందు 28, 29 తేదీల్లో లోలోపల జరిగే ప్రచారం అభ్యర్థుల గెలుపు ఓటముల్ని ప్రభావితం చేయనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇన్నాళ్లుగా అనుసరించిన వ్యూహాలు, ఎత్తుగడలకు భిన్నంగా తాయిలాలు, ప్రలోభాలపర్వం అధికంగా కనిపించే వీలుంది. మరోవైపు (మిగతా 2లో..)

# కేసీఆర్ ముందుచూపును మెచ్చుకోవాల్సిందే..



హైదరాబాద్,అక్టోబరు 27, ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు చేసిన ఇరవైఏళ్ల నేపథ్యంలో హైదరాబాద్ మహానగరంలోని హైటెక్స్ లో.. భారీ ఎత్తున నిర్వహించిన ఒక రోజు ప్లీనరీని ఎంత ఘనంగా నిర్వహించారో తెలిసిందే. అంగరంగ వైభవంగా నిర్వహించిన పార్టీ ప్లీనరీ పుణ్యమా అని.. హైదరాబాద్ మహానగరంలోని ప్రధాన రహదారులు మొత్తం గులాబీ మయం కావటం తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపించినా పాలక పక్షం కానీ.. అధికారులు కానీ పెద్దగా పట్టించుకోకపోవటం తెలిసిందే.ఇదంతా ఒక ఎత్తు అయితే.. ప్లీనరీ సందర్భంగా చోటు చేసుకున్న ఒక కీలక మార్పు మాత్రం ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. (మిగతా 2లో..)

## కేంద్రంపై దర్యాప్తు..

# జరిగే పనేనా ?



న్యూఢిల్లీ,అక్టోబరు 27, ప్రజాపాలన ప్రతినిధి: దేశంలోని ప్రముఖుల మొబైల్ ఫోన్లను ట్యాపింగ్ చేయించిందనే ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వంపై విచారణ సాధ్యమేనా అనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. పెగాసస్ అనే సాఫ్ట్ వేర్ ద్వారా కేంద్రం దేశంలోనే వందల మంది ప్రముఖుల మొబైల్ ఫోన్లను ట్యాపింగ్ చేయిస్తోందనే వార్తలు ఆమధ్య దేశంలో ఎంత సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఫోన్ల ట్యాపింగ్ పై ఎంతమంది కేంద్రాన్ని ప్రశ్నించినా సమాధానం రాలేదు. దాంతో కొందరు జర్నలిస్టులు, సామాజిక ఉద్యమకారులు సుప్రింకోర్టులో కేసులు వేశారు.ఆ కేసును విచారించిన సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులిచ్చింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలకు కేంద్రం సరైన సమాధానాలు చెప్పలేదు. పెగాసస్ సాఫ్ట్ వేర్ ద్వారా ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేయించారా లేదా అని చెప్పమని ఎన్నిసార్లు అడిగినా కేంద్రం సరైన సమాధానం చెప్పలేదు. దాంతోనే ప్రముఖుల మొబైల్ ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయన్న విషయం అందరికీ అర్థమైపోయింది.తమ ప్రశ్నలకు కేంద్రం స్పష్టమైన సమాధానాలు ఇవ్వకపోవటంతో ఓ స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాల్సుంటుందని తీవ్రంగానే హెచ్చరించింది. అయినా కేంద్రం పట్టించుకోలేదు. దాంతో అప్పటికి కేసు విచారణను వాయిదా వేసింది. అప్పుడు వాయిదా వేసిన కేసుపై సుప్రీంకోర్టు ఈరోజు తీర్పు చెప్పనుంది. (మిగతా 2లో..)





## స్థానికేతర వ్యక్తులు నియోజకవర్గాన్ని ఖాళీ చేయాలి: సీపి

హుజూరాబాద్‌లో ఎన్నికల ప్రచారం ముగిసింది. స్థానికేతర వ్యక్తులు నియోజకవర్గాన్ని వదిలి వెళ్లిపోవాలని (మిగతా 2లో..)

# ల్యాప్‌టాప్ ఇవ్వాలనుకుంటున్నారా..



హైదరాబాద్,అక్టోబరు 27, ప్రజాపాలన ప్రతినిధి: ఆన్‌లైన్ విద్య అందని పేద విద్యార్థుల కోసం తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు ల్యాప్‌టాప్, ట్యాబ్‌లు విరాళంగా ఇవ్వాలని దాతలకు గవర్నర్ పిలుపునిచ్చారు. అలాగే నిరుపయోగంగా ఉన్న ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు ఇవ్వాలని ఐటీ కంపెనీలు, సంస్థలకు గవర్నర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు రాజ్‌భవన్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దాతలు 94900 00242 నంబర్‌కు సంప్రదించాలని, లేదా rajbhavan-hyd@gov.in మెయిల్‌కు వివరాలు పంపవచ్చని సూచించారు. (మిగతా 2లో..)

# వరిపై మంత్రులు, అధికారుల విభిన్న ప్రకటనలు





హైదరాబాద్,అక్టోబరు 27, ప్రజాపాలన ప్రతినిధి: వరిపై మంత్రులు,అధికారులు ఎవరికి వారు విభిన్న ప్రకటనలు చేస్తున్నారు. రైతులంతా బ్రహ్మాండంగా వడ్లు వేసుకొవచ్చన్నారు ఆర్థిక మంత్రి హరీష్ రావు. యాసంగి వడ్లే కొనబోమని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కావాలనే బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు హరీష్ రావు. వరి విత్తనాలు అమ్మితే షాపులు క్లోజ్ చేస్తామని..సుప్రీం కోర్టు ఆర్డర్ వచ్చినా లెక్కచేయనని సిద్దిపేట కలెక్టర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే..యాసంగిలో వరిధాన్యం కొనుగోలుచేసే పరిస్థితి లేదన్నారు మంత్రి జగదీశ్ రెడ్డి.. ప్రత్యామ్నాయపంటలపై రైతులు దృష్టిపెట్టాలన్నారు.. వరిసాగు-ప్రత్యామ్నాయ పంటలు, వడ్ల కొనుగోలుపై మంత్రి సమీక్ష నిర్వహించారు, దేశంలో నూనెగింజల కొరత ఉంది కాబట్టి.. రైతులు వాటిని సాగుచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాలు కూడా అధికంగా వరిని పండించడం వల్లే కేంద్రం చేతులెత్తేసిందని తెలిపారు. ప్రత్యామ్నాయ విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు మంత్రిజగదీశ్ రెడ్డి. రైతులు హైబ్రిడ్ లేదా సూటి రకాల వరి విత్తనోత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు కరీంనగర్ కలెక్టర్ ఆర్.వి.కర్ణన్. సీడ్ ప్రొడక్షన్ కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు సన్నరకం ధాన్యం కొనుగోలుకు అంగీకరించినందున.. రైతులు సన్నాలు వేసుకోవచ్చన్నారు. ఇక ప్రైవేటు విత్తన కంపెనీలు, సీడ్ కార్పొరేషన్ తో ఒప్పందం చేసుకున్న రైతులు వరి విత్తన ఉత్పత్తి చేసుకోవచ్చని చెప్పారు. నీరు నిల్వ ఉండే నేలలు, చౌడు నేలల్లో వరి పంటను సాగు చేసుకోవాలన్నారు. సర్కారు యాసంగి ధాన్యం కొనేదిలేదని చెప్పకుండా.. ప్రైవేటు విత్తన కంపెనీలతో ఒప్పందం ఉన్నరైతులే సాన్నాలు సాగు చేయాలన్నారు కరీంనగర్ కలెక్టర్. మిల్లర్లు కొంటామని చెప్పినందున.. సన్న రకం సాగు చేయొచ్చని చెప్పారు కర్ణన్.



# మారుతున్న రంగులు



(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ టికెట్ దక్కింది. ఇదే టికెట్‌ను ఆశించిన దయాకర్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి విన్ అయ్యారు. ఇదే ఏడాది కొత్తగా ఏర్పడిన దేవరకద్ర నియోజకవర్గం నుంచి దయాకర్‌రెడ్డి భార్య సీత కూడా టీడీపీ నుంచి పోటీ విజయం సాధించారు. 1999లో ఈమె దేవరకద్ర జడ్పీటీసీగా గెలుపొంది, ఉమ్మడి పాలమూరు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. తెలంగాణ టీడీపీలో నాయకత్వం కొరవడింది. స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత పార్టీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. రెండు సార్లు జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్‌ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని చవి చూసింది. దీంతో ఇదే పార్టీలో ఉన్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టగా, ఇటీవల టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ కారెక్కారు. దీంతో పార్టీ నాయకత్వంపై అనిశ్చితి నెలకొంది. షాద్‌నగర్‌కు చెందిన బక్కని నర్సింహులుకు అవకాశం ఇచ్చినా పెద్దగా ప్రభావం చూపడం లేదు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ పుంజుకుంటున్నాయి. ఈ క్రమం లోనే పార్టీ పరిస్థితిపై దయాకర్ రెడ్డితో పాటు మరికొందరు నాయకులు చంద్రబాబు నాయుడుతో త్వరలో భేటీ కానున్నట్లు తెలిసింది. ఈ భేటీలో పార్టీకి పూర్వవైభవానికి ఆయన తీసుకునే చర్యల ఆధారంగా ఇతర పార్టీల్లో చేరే విషయంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. దయాకర్‌రెడ్డితో పాటు ఆయన భార్య కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరి కుమారుడు సిద్ధార్థ్‌రెడ్డిని కూడా రాజకీయ అరంగేట్రం చేయించడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరు ఏ పార్టీలో చేరినా దేవరకద్ర, మక్తల్, నారాయణపేట అసెంబ్లీ స్థానాలపై హామీ తీసుకుంటారనే చర్చ నడుస్తోంది. దేవరకద్ర నుంచి సీతమ్మ, మక్తల్ నుంచి దయాకర్‌రెడ్డి పోటీకి సిద్ధంగా ఉండగా, నారాయణపేట నుంచి సిద్ధార్థ్‌రెడ్డిని బరిలో దింపేందుకు సన్నద్ధం చేస్తున్నారు. దేవరకద్ర నుంచి కాంగ్రెస్ తరఫున జి.మధుసూదన్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్‌గౌడ్ మధ్య ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీ ఉండగా, బీజేపీ నుంచి డోకూరు పవన్ కుమార్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. నారాయణపేట కాంగ్రెస్ నుంచి ఆ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, చిట్టెం అభిజిత్‌రెడ్డి మధ్య టికెట్ కోసం పోటీ ఉండే చాన్స్‌ఉంది. బీజేపీ నుంచి నాగూరావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, సత్యయాదవ్ కూడా ఆ పార్టీ నుంచి టికెట్ ఆశించే అవకాశం ఉంది. ఇక మక్తల్ కాంగ్రెస్‌లో వాకిటి శ్రీహరి, రాజుల ఆశిరెడ్డికి ఉండగా, బీజేపీ నుంచి కొండయ్య, జలంధర్‌రెడ్డిలు ఉన్నారు. టీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండనే ఉన్నారు. ఈ లెక్కన వైఎస్సార్ టీపీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఇటీవల వీరిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించగా.. అనుచరులతో చర్చించి నిర్ణయం చెబుతామని మాటిచ్చారు. ఈ నేపథ్యంలో రేవంత్ గట్టి హామీ ఇస్తే కాంగ్రెస్ వైపు వెళ్లే అవకాశాలు కూడా లేకపోలేదు.

## స్థానికేతర వ్యక్తులు నియోజకవర్గాన్ని ఖాళీ చేయాలి: సీపి

(మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి. సత్యనారాయణ స్పష్టం చేశారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 2వేల మంది సిబ్బందితో పాటు 20 కంపెనీల కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలు, సీపీ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు సత్యనారాయణ. ఉప ఎన్నిక ప్రచారం సమాప్తం కావడంతో నియోజకవర్గంలో ఒక్కసారిగా నిశబ్ధం అలుముకున్నది. ప్రతి ఎన్నికకు 48 గంటల ముందు నిలిపి వేసే ప్రచారాన్ని ఈ ఎన్నికల్లో మాత్రం 72 గంటల ముందు నిలిపి వేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. కేంద్ర బలగాలు కూడా తోడవడంతో ఎక్కడికక్కడ తనిఖీలు ముమ్మరం చేశారు.

## రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి**





ఇబ్రహీంపట్నం అక్టోబర్ 26ప్రజాపాలన ప్రతినిధి :రాష్ట్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్లో టిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. కరువు పీడిత ప్రాంతాలను విముక్తి చేసేందుకు సీఎం కేసీఆర్ సాగు, తాగునీరు ప్రాజెక్టులకు రూపకల్పన చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, రాష్ట్ర యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ టిఆర్ఎస్ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బలదేవారెడ్డి, ముత్యంరెడ్డి, లక్ష్మారెడ్డి, పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలుకల బుగ్గరాములు, కర్నాటి రమేష్ గౌడ్, చీరాల రమేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు జెర్కొని రాజు, టిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు నిట్టు జగదీష్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ టిఆర్ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్.

## కేంద్రంపై దర్యాప్తు.. జరిగే పనేనా ?

(మొదటి పేజీ తరువాయి)

ఒకవేళ సుప్రీంకోర్టు గనుక స్వతంత్ర సంస్థతో దర్యాప్తుకు ఆదేశిస్తే సదరు సంస్థకు కేంద్రం సహకారం అందిస్తుందా అనేది చాలా కీలకం. సుప్రీంకోర్టుకు సరైన సమాధానాలు చెప్పని కేంద్రప్రభుత్వం స్వతంత్ర సంస్థ దర్యాప్తుకు ఏమి సహకరిస్తుంది ?

స్వతంత్ర దర్యాప్తు సంస్థకు కేంద్రం సహకరించకపోతే అప్పుడు సుప్రీంకోర్టు ఏమి చేస్తుంది ? అన్నదే కీలకమైంది. నిజానికి ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్ అన్నది పెద్ద నేరం. అయితే దేశరక్షణకు విఘాతం కలుగుతోందని అనుమానించినపుడు, అనుమానిత వ్యక్తుల కదలికలపైనా, ఫోన్లపైనా నిఘా పెట్టడం తప్పు కాదు. అయితే ఆ పని చేయాలంటే అందుకు ఓ ప్రొసీజర్ ఫాలో అవ్వాలి. ఆ ప్రొసీజర్ ను కేంద్రం ఏమాత్రం ఫాలో అవ్వలేదని అర్ధమైపోయింది.

ఇక్కడ గమనించాల్సిందేమంటే ఏ ప్రభుత్వంలో అయినా అనుమానితుల ఫోన్లు ట్యాపింగ్ జరుగుతునే ఉంటుంది. కానీ ఇపుడు మాత్రం జడ్జీలు, జర్నలిస్టులు, ప్రతిపక్ష నేతలు, వాళ్ళ పీఏలు, పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలతో పాటు ఇతర రంగాల్లో ప్రముఖులకు చెందిన కొన్ని వేల ఫోన్లను ఏకకాలంలో ట్యాపింగ్ జరిగిందనే ఆరోపణలు పెరిగిపోతున్నాయి. ఇక్కడే నరేంద్ర మోడీ సర్కార్ ఆరోపణలకు సమాధానాలు చెప్పుకోలేక అవస్థలు పడుతున్నది. విచిత్రం ఏమిటంటే ట్యాపింగ్ కు గురైన ఫోన్లలో ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా ఉండటం.

## ఇక ప్రలోభాల వంతు!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం కూడా నియోజకవర్గంపై దృష్టి సారిస్తోంది. ఎన్నికల ప్రవర్తన నియామావళిని ఉల్లంఘించేవారిపై చర్యలు తీసుకునేలా ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయి.

**హోరాహోరీ ప్రచారం**

మూడు ప్రధాన పార్టీల తరఫున ప్రచారం హోరాహోరీగా సాగింది. మాటల తూటాలు పేలాయి. పరస్పర ఆరోపణలు వెల్లువెత్తాయి. తెరాస తరఫున మంత్రి హరీశ్‌రావు ప్రచార బాధ్యతను తన భుజాన మోశారు. మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ముమ్మరంగా ప్రచారం చేశారు. భాజపా తరఫున కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, నిత్యానందరాయ్, పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి తరుణ్ ఛుగ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ, కాంగ్రెస్ తరఫున రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్, సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, పీసీసీ మాజీ చీఫ్ ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ అర్వింద్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రచారంలో పాల్గొననున్నారు.

## ల్యాప్‌టాప్ ఇవ్వాలనుకుంటున్నారా..

(మొదటి పేజీ తరువాయి)

### కలల సాకారానికి శ్రమించాలి.. ఓయూ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై



సవాళ్లను ఎదుర్కొంటూ.. కలలను సాకారం చేసుకునేందుకు విద్యార్థులు శ్రమించాలని.. అప్పుడే విజేతలుగా నిలుస్తారని గవర్నర్ తమిళిసై అన్నారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ 81వ స్నాతకోత్సవం ఠాగూర్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగింది. రెండేళ్ల విరామం అనంతరం స్నాతకోత్సవం జరుగుతుండడంతో 2018-2019, 2019-2020 విద్యా సంవత్సరాలకు సంబంధించిన విద్యార్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీ పట్టాలను ఈ సందర్భంగా ప్రదానం చేశారు. కార్యక్రమానికి వర్సిటీ వైస్ చాన్సలర్ హోదాలో గవర్నర్ తమిళిసై, ముఖ్య అతిథిగా డీఆర్‌డీఓ చైర్మన్, కేంద్ర రక్షణ పరిశోధన, అభివృద్ధి శాఖ కార్యదర్శి జీ సతీశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ విద్యార్థులతో వర్సిటీ సంప్రదాయం ప్రకారం ప్రతిజ్ఞ చేయించి, ఆ తర్వాత 35 మందికి బంగారు పతకాలను ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకునే క్రమంలో ఆరోగ్యం, సంతోషాల విషయంలో రాజీపడొద్దని సూచించారు. చిన్న, చిన్న సమస్యలకు కుంగిపోకూడదని, విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై కృషి చేయాలని సూచించారు. దేశం అన్ని రంగాల్లో పురోగమించేందుకు నూతన ఆవిష్కరణలు కీలకమన్నారు. శతవసంతాల వర్సిటీలో ఉన్నత విద్య అభ్యసించడం గర్వించదగిన విషయమని, వారంతా తిరిగి వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## కేసీఆర్ ముందుచూపును మెచ్చుకోవాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

పార్టీకి సంబంధించిన ఈ కీలకమైన మార్పును చూస్తే.. రాబోయే రోజుల్లో ఏదైనా అనుకోనిది జరిగితే.. ఎలాంటి ఇబ్బంది కలుగకకుండా ముందస్తు జాగ్రత్తల్లోనే భాగంగా తాజా రూల్ ఉండటం గమనార్హం. తన రాజకీయ వారసత్వాన్ని కొడుకు కేటీఆర్ కు అప్పజెప్పాలన్న విషయం మీద కేసీఆర్ చాలా క్లారిటీతో ఉన్న విషయం తెలిసిందే.

## కొండూరు లక్షవర కుమార్ ప్రథమ వర్దంతి సందర్బంగా నివాళులు అర్పించి మాజీ కార్పొరేటర్ జోత్స్నా నాగేశ్వరావు



వేడిపల్లి, అక్టోబర్27 (ప్రజాపాలన ప్రతినిధి) :రామంతాపూర్ డివిజన్ గోఖలేనగర్ టీఆర్ఎన్ సీనియర్ నాయకులు కీ''శే''కొండూరు లక్షవర కుమార్ ప్రథమ వర్దంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపిన రామంతాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న నాగేశ్వరావు. ఈ కార్యక్రమం లో తెరాస నాయకులు ఇంద్రసేనా రెడ్డి ,జగదీష్ కుమార్,వెంపటి శ్రీను,మనీష్ ,అలె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లి గ్రామ ఉప సర్పంచ్ పై అవిశ్వాస తీర్మానం





వికారాబాద్ బ్యూరో 27 అక్టోబర్ ప్రజాపాలన : ఉప సర్పంచ్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం బుధవారం నెగ్గింది వికారాబాద్ మండలం ఎర్రవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వెంకట ఉపేందర్ రెడ్డి ఎంపిడిఓ చంద్రశేఖర్ సమక్షంలో గ్రామ సర్పంచ్ చొప్పరి మల్లమ్మ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతంలో ఉప సర్పంచ్ నజీ మున్నీసా బేగంపై అవిశ్వాసం ప్రకటిస్తూ వార్డు సభ్యులు ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు బుధవారం నాడు ఆర్డీవో తో పాటు ఎంపిడిఓ చంంద్రశేఖర్ సమక్షంలో ఉపసర్పంచ్ నజీ మున్నీసా పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ చొప్పరి మల్లమ్మ, వార్డు సభ్యులు ఎస్.జైపాల్ రెడ్డి, పి . తుల్జయ్య, గాలి ఆనందం, సిలారి లక్ష్మి, ఎరుకల ఎల్లమ్మ, చిడి గిద్ద మల్లమ్మ , హాజరైనారు. ఎనిమిది మంది సభ్యులకు గాను ఆరు మంది వార్డు సభ్యులు హాజరైనారు. ఉప సర్పంచ్ నజీ మున్నీసా పై పెట్టిన అవిశ్వాస తీర్మానం గురించి అధికారులు వార్డు సభ్యులకు వివరించారు. అందులో ఉప సర్పంచ్ పదవి నుంచి నజీమ్ మున్నీసా బేగంను పదవి నుంచి తొలగించాలని ఆరు మంది వార్డు సభ్యులు తీర్మానం చేస్తూ చేతులు పైకి ఎత్తారు. మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు ఉప సర్పంచ్ గా కొనసాగిన నజీ మున్నీసాను తొలగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. గ్రామ సభ తీర్మానం అంశాలను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఆర్ డి ఓ తెలిపారు. ఉప సర్పంచ్ ఎన్నిక కోసం మరో తేదీ ఉన్నతాధికారులు ఖరారు చేస్తారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ ఐ లక్ష్మయ్య పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ధరలు పెరుగుదలకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



బోనకల్, అక్టోబరు 27 ప్రజా పాలన ప్రతినిధి: బోనకల్ మండలం పరిధిలోగల ముష్టికుంట్ల గ్రామంలో మంగళవారం నాడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో రైతులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా, గ్యాస్ ధరలు, ఎరువుల ధరలు, డీజిల్ పెట్రోల్ ధరలు, అగ్గిపెట్ట ధరలు పెరుగుదలకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దొప్ప కొరివి, వీరబాబు, వెంకటేశ్వరరావు, బంధం శ్రీనివాస రావు, కందికొండ శ్రీనివాసరావు, అప్పా చారి, అప్పారావు, షేక్ నజీర్ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా అనాధ ఆశ్రమంలో అన్నదానం



మధిర అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి : మధిరలో మానవ సేవే మాధవ సేవ అంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మధిర రెస్క్యూ టీం. సారథ్యంలో నిర్వహిస్తున్న. ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమం లో.. దివ్య పుట్టినరోజు సందర్భంగా.. పేదలకు మతిస్థిమితం లేని వారికి భోజనం పండ్లు అందించడం జరిగింది.కార్యక్రమంలో మధిర రెస్క్యూ టీం.దోర్నాల రామకృష్ణ నిస్సి జ్యోతి ఆర్ కె. రమ రామారావు రాము పాల్గొన్నారు.

## విజయ గర్జన మహాసభను దిగ్విజయం చేద్దాం



వికారాబాద్ బ్యూరో 27 అక్టోబర్ ప్రజాపాలన : వరంగల్ లో జరిగే విజయ గర్జన మహాసభను విజయవంతం చేద్దామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో తేజ ఫంక్షన్ హాల్ లో పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షుడు దావల్ గారి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టిఆర్ఎస్ కార్యకర్తల విజయ గర్జన మహా సభ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ నాదనే భావన ప్రతి కార్యకర్త హృదయంలో పెల్లుబుకాలని సూచించారు. ప్రతి గ్రామం నుండి సుమారు 50 మంది కార్యకర్తలు వరంగల్ లో జరిగే విజయ గర్జన మహాసభకు తరలిరావాలని పేర్కొన్నారు. వరంగల్ లో జరిగే విజయగర్జన సమావేశం వివరాలను ప్రతి కార్యకర్త తన గ్రామంలో వివరించాలని తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన ప్రతి సంక్షేమ పథకం గురించి గడపగడపకు చేర్చాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తు చేశారు. తెలంగాణలో అమలుపరుస్తున్న ప్రతి పథకం దేశంలో కీర్తింపబడుతున్నాయని కొనియాడారు. తెలంగాణ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు ఇతర రాష్ట్రాల వారు వచ్చి పరిశీలించి అమలుపరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా మౌలిక వసతుల కల్పనల సంస్థ అధ్యక్షుడు జి.నాగేందర్ గౌడ్,జడ్పి వైస్ చైర్మన్ బి.విజయ్ కుమార్,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్ళపల్లి రమేష్, జడ్పిటిసిలు, ఎంపిపిలు, మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపిటిసిలు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలి: ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



వేడివల్లి, అక్టోబర్27 (ప్రజాపాలన ప్రతినిధి) :టీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్ వివిఎన్ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన ఉప్పల్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ టీఆర్ఎస్ ఇన్చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిని శాలువాతో సన్మానించిన రామంతాపూర్ డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షులు ఎండి ముస్తాక్. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారు లక్ష్మారెడ్డి, తాడూరి శ్రీనివాస్, కార్పోరేటర్లు బొంతు శ్రీదేవి యదవ్, ,స్వర్ణరాజ్ ,ప్రభుదాస్,దేవేందర్ రెడ్డి ,శాంతిసాయి జెన్ శేఖర్,మాజీ కార్పోరేటర్లు గంధం జోస్నా నాగేశ్వరావు, నాయకులు రేపాక కుమారస్వామి, భాగ్యరేఖ, సంధ్యారాణి, సంపత్ వివిధ డివిజన్ల అధ్యక్షులు,జనరల్ సెక్రెటరీలు,కార్యకర్తలు,మహిళ నాయకులు పాల్గోన్నారు.

## కోవిడ్ వాక్సిన్ టార్గెట్ పూర్తి చేయండి



మధిర అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి : ఈ రోజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరపున జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారిని డా అలివేలు మేడం మధిర ప్రభుత్వ హాస్పిటల్ నందు నిర్వహిస్తున్న కోవిడ్ వాక్సిన్ ప్రోగ్రాం మరియు యూనివర్సల్ ఇమ్యూనిజషన్ ప్రోగ్రాం ను ఆమె తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవిడ్ వాక్సిన్ రెండొవ డోస్ 100%టార్గెట్ రీచ్ అవ్వాలి అని పారామెడికాల్ సిబ్బంది కీ సూచించారు. ఈ కార్యక్రమం లో %సతీ% అనిల్ కుమారు కనకపూడి %సతీ% మనోరమ %సతీ% పుష్ప లత %సతీ% శ్రీనివాస్ మరియు %ణజశ్రీఎ% చింతల వెంకట రమణ హెడ్ నర్స్ లు %ఖఅఎ% లు ఫార్మసిస్ట్ పాల్గొన్నారు.

## బృందావనం ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కోట రాంబాబు



మధిర అక్టోబ27 ప్రజా పాలన ప్రతినిధి : మండలం కృష్ణాపురం గ్రామ సమీపంలో వైరా రోడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన బృందావనం ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా దిశ కమిటీ సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డా. కోట రాంబాబు ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ యజమానులు కోటిరెడ్డి లోకేష్ నరేష్ , శ్రీనివాస రెడ్డి తదితరులు ఉన్నారు.

## జాయిన్ ఇన్ ఇండియన్ ఆర్మీ- ఇఫ్ నాట్ పాజిబుల్ జాయిన్ ఇన్ స్టూడెంట్ ఆర్మీ



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 26 ప్రజా పాలన ప్రతినిధి :ఏబీవీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అక్టోబర్ 27,28,29 వ తేదీలలో ఏబీవీపీ మెంబర్షిప్ డ్రైవ్ సందర్భంగా వీరపట్నం శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఇబ్రహీంపట్నం నగర డిగ్రీ కళాశాలలో గణంగా ప్రారంభిచడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగ.సంజీవ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ఒక విద్యార్థి ఉద్యమం అనే నినాదంతో ముందుకు పోతూ,విద్య జీవితం కోసం,జీవితం దేశం కోసం అనే స్పూర్తితో విద్యార్థులను జాతీయవాదులుగా మలిచి దేశం కోసం,మాతృభూమి కోసం పనిచేయాలనే తపన కలిగిన విద్యార్థులందరికీ ఏబీవీపీ ఒక వేదికగా ఉంటూ దేశంలోని విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ,సామాజిక సమస్యలపై దేశాన్ని జాగృత పరుస్తూ ముందుకు పోతున్న ప్రపంచంలోని అతి పెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ.కావున ఏబీవీపీ లో పని చేయాలనే తపన కలిగిన విద్యార్థులందరికీ సభ్యత్వ నమోదు ద్వారా గొప్ప అవకాశం కల్పించడం జరుగుతుంది.కావున ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగించేసుకొని భాగస్వాములు కావాలని కోరారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయి ధనరాజ్, ఏబీవీపీ విభాగ్ టెక్నీకల్ సెల్ కన్వీనర్ శశిధర్ రెడ్డి,సోషల్ మీడియా కన్వీనర్ పవన్,ఎస్.ఎఫ్.డి కన్వీనర్ సందీప్, నగర కార్యదర్శి హేమంత్, నగర ఎస్.ఎఫ్.డి కన్వీనర్ ప్రవీణ్,నగర సంయుక్త కార్యదర్శి జగదీశ్,శ్రీనివాస్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కులను అందించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు 40 మందికి బుధవారం నాడు స్థానిక క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కులను అందించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాల ప్రజలు ముస్లిం మైనార్టీ లకు చెందిన ప్రజలు ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ఎంతో కొంత మేలు చేయడానికి ప్రవేశపెట్టిన పథకం షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, అని ఆయన అన్నారు.బుధవారం నాడు నియోజకవర్గంలోని 40 మంది లబ్ధిదారులకు 40 లక్షల నాలుగువేల 600 రూపాయల కళ్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ టి, సత్యనారాయణ, బెల్లంపల్లి ఎంపీపీ గోమాస శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాణి-సురేష్ , మండల ఎంపీటీసీలు, సర్పంచ్లు, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్వేత-శ్రీధర్, వైస్ చైర్మన్ సుదర్శన్ , కౌన్సిల్ %డ% కో ఆప్షన్ సభ్యులు, బెల్లంపలి పట్టణ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, తెరాస నాయకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రభుత్వం ప్రారంభించాలి



యాదాద్రి అక్టోబర్ 27 వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి బుధవారం మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి 20 రోజులు గడుస్తున్నా అన్ని పనులు వదిలేసి అక్కడే ఉండవలిసి వస్తుందని,ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను గమనించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆయన అన్నారు.ప్రభుత్వం 7 సంవత్సరాలుగా ప్రాజెక్టులు నిర్మించి ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని గొప్పలు చెప్పి ప్రస్తుతం వరి పైరుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్లతో చెప్పించడం విడ్డురంగా ఉందని,రైతు పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకునే నాయకులు ప్రస్తుతం రైతులకు న్యాయం చేయాలని అన్నారు.ఎరువుల దుకాణాలలో వరి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణాల లైసెన్స్ లు రద్దుచేస్తామని కలెక్టర్లు బెదిరిస్తున్నారని అది సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు.రైతులకు ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తుమ్మల నర్సయ్య,పాశం సత్తిరెడ్డి,బొల్ల శ్రీనివాస్,షేక్ రసూల్,కుందారపు కొమురయ్య,బత్తిని లింగయ్య,పాండు,గరిసే రవి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ పాషా నరహరి వర్ధంతి



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 26 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మండల పరిధి పెత్తుల్ల గ్రామం లో కామ్రేడ్ పాషా నరహరి గార్ల 32 వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది ఈ సభకు సిపిఎం పార్టీ గ్రామ కన్వీనర్ కోడూరు రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పేద ప్రజల కోసం కామ్రేడ్ మహబూబ్ పాషా నరహరి గార్లు వాళ్ళ జీవితాలను పేద ప్రజల కోసం అంకితం చేశారని పెత్తందారి పట్వారి పటేల్ వ్యవస్థకు వ్యతిరేకంగా దున్నేవాడికె భూములు ఇవ్వాలని కూలి రేట్లు పెంచాలని పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎల్లవేళలా కృషి చేశారని భూమి భుక్తి పేద ప్రజల విముక్తి కోసం నిరంతరం పోరాడారని రంగారెడ్డి జిల్లాలో భూ పోరాటాలు చేసి పేద ప్రజలకు వేల ఎకరాలు భూ పంపిణీ చేశారని దున్నేవాడిదే భూమి కావాలని వెట్టి చాకిరి విముక్తి కోసం అనేక పోరాటాలు చేశారని భూస్వాముల గుండెల్లో సింహ స్వప్నంల పాష నరహరి గారు ఉండేవారని ఇబ్రహీంపట్నం లో విద్యార్థులు చదువుకోవాలని వాళ్ళ కోసం ప్రభుత్వ కళాశాలల ఏర్పాటు చేయాలని ఆయన పోరాటాలు చేశారు వారి పోరాట ఫలితంగా ఇబ్రహీంపట్నంలో ఇంటర్ కాలేజీ కూడా కట్టించడం జరిగింది వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని యువత పాషా నరహరి గార్ల ను ఆదర్శంగా తీసుకొని వారి స్ఫూర్తితో ముందు ముందు మరిన్ని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో దయ్యాల గణేష్. బండి గణేష్. బోద రమేష్. దయ్యాల భాస్కర్. బోద సంజీవ. బోద మహేందర్. బత్తుల కిష్టయ్య. బండి దాసు. కొరిమి అంజయ్య. ఆచ్చన శివ. నాగటి నరసింహ. పంబలి పాండు. పంతులు సత్తయ్య. కుమ్మరి వెంకటేష్. గజ్జల మహేష్. దయ్యాల కుమార్. బత్తుల శ్రీను. కోడూరు జంగయ్య. ప్రభాకర్. జగన్. ప్రభు. కార్యకర్తలు మహిళలు సానుభూతిపరులు పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ విస్తృత కార్య క్రమానికి తరలి వెళ్తున్న కార్పొరేటర్లు



బాలాపూర్:అక్టోబర్27, ప్రజాపాలన ప్రతినిధి : మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి మీర్ పేట్ కార్పొరేషన్ లో ముఖ్య అతిథి డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి తో పాటు మేము సైతం అంటూ 16 వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశాన్ని దిగ్విజయం చేయడానికి తరలి వెళుతున్న కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు టిఆర్ఎస్ అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దాసిరెడ్డిగూడెం గాంధీనగర్ వాసులకు న్యాయం చేయండి



యాదాద్రి అక్టోబర్ 27 వలిగొండ ప్రజాపాలన ప్రతినిది మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెంలోని గాంధీనగర్ కాలనీవాసుల సమస్యలపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) కిసాన్ మోర్చా మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు బందారపు రాములు బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 1992 సంవత్సరంలో ఆనాడు నల్గొండ ఉమ్మడి జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంయుక్తంగా పరిపాలన సమయం వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెం గ్రామంలో (రెడ్లరేపాక గ్రామపంచాయతీ విభజన జరగక ముందు) పరిధిలో దళితులకు.వెనకబడిన కులాలు బీసీలకు.ఇతర కులాలకు సంబంధించిన ఓసి.నిరుపేదలకు.ఇంటి స్థలాల కొరకు గ్రామంలోని భూమి సర్వే నెంబరు 354 లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పట్టాదారులు రావుల చెన్న మల్లారెడ్డి తండ్రి చంద్రారెడ్డి ఎ 1.95 సెంట్లు రావుల బుచ్చిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి 0.50 సెంట్లు రావుల యాదగిరి రెడ్డి తండ్రి చంద్రారెడ్డి ఎ 1.90 సెంట్లు మొత్తం 4 ఎకరముల 35 సెంట్లు భూమిని కొనుగోలు చేసి 87 ప్లాట్లుగా విభజించి 87 మంది లబ్ధిదారులకు ఆనాటి మాజీ శాసనసభ్యులు గుర్రం యాదగిరిరెడ్డి ద్వారా ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. గృహములు నిర్మించుకొని ఆ యొక్క గృహములలో సంసారం చేసుకుంటూ జీవిస్తున్నారు.నేటికి సుమారు 29 సంవత్సరాలు కావస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడిన సందర్భంలో మా యొక్క గ్రామం కూడా ప్రత్యేక గ్రామ పంచాయతీ గా ఏర్పడింది. 1992 సంవత్సరం నుండి ఈనాటి వరకు ఉమ్మడి గ్రామపంచాయతీలో ఐదుగురు (5) సర్పంచులు మారిపోయారు.ఈనాడు కొత్తగా ఏర్పడిన మా గ్రామ పంచాయతీకి సర్పంచిగా.కొమురెల్లి సరితా సంజీవరెడ్డి.ఎన్నికయింది. ఐదుగురు సర్పంచుల పరిపాలనలో గ్రామంలో ఎలాంటి సమస్యలు లేక గ్రామ ప్రజలందరూ. కలిసిమెలిసి సోదర భావంతో జీవించారు. ప్రస్తుతం సర్పంచ్ పదవిలో కొనసాగుతున్న సర్పంచ్ భర్త కొమురెల్లి సంజీవరెడ్డి.ప్రజల మధ్య సమస్యలు సృష్టిస్తూ. తన ఇష్టమున్న అరాచకాలు చేస్తూ ప్రజల జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాడని పేర్కొన్నారు.ఇదే క్రమంలో 1992 సంవత్సరంలో.ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి ఇచ్చిన ప్లాట్లు అందులో భూమి హెచ్చుతగ్గులుగా ఉన్నదని పేర్కొంటూ అక్రమ సంపాదనకు స్వార్ధ సంపాదనకు ఇచ్చిన ప్లాట్లలో భూమి ఎక్కువగా ఉన్నదని ఆరోపణ చేస్తూ అధికారులతో కుమ్మక్కై ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నాడని తెలిపారు.ప్రజలను బెదిరిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడు.ఈ విషయంపై స్థానిక ఎంపిడిఓ. తహసిల్దార్ లకు.వినతి పత్రం సోమవారం రోజున ఇచ్చిన అధికారులు పేదలకు న్యాయం జరగకుండా.ఎలాంటి చర్యలు తీసుకోకుండా.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు సర్పంచ్ భర్త కొమురెల్లి సంజీవరెడ్డి. ఇండ్లు నిర్మించుకొని. జీవిస్తున్న పేదల ఇండ్ల ప్రక్కనున్న కొద్ది పాటిగా నున్న కోసుమూలలలో ఉన్న భూమి అమ్ముకొని సొమ్ము చేసుకోవాలను కుంటూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడని. ఇప్పటికైనా సర్పంచ్ భర్త కొమురెల్లి సంజీవరెడ్డి గ్రామంలో చేస్తున్నా అక్రమ ధనార్జన ప్రయత్నాలు నిలిపివేసి.అధికారులు స్పందించి గాంధీనగర్ ప్రజలు న్యాయం చేయాలని కోరుతున్నారు.ఈ సమావేశంలో కొనపూరి లింగస్వామి,దాసరి శ్రీనివాస్, కొమ్ము లక్ష్మయ్య,పత్తెపు లక్ష్మయ్య,రాసూరి ఐలయ్య, రాపోలు నరేష్,రాపోలు అనిల్,రాపోలు ఎల్లయ్య, అంగోతు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విజయ గర్జన సభను జయప్రదం చేయండి:ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి: నవంబర్ నెల 15వ తేదీన వరంగల్లో జరుపతలపెట్టిన తెలంగాణ విజయ గర్జన సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం స్థానిక పద్మశాలి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన నియోజకవర్గం స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో మంచిర్యాల శాసన సభ్యులు నడిపెల్లి దివాకర్ రావు తో కలిసి పాల్గొన్నారు . సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్లు లో జరుప తలపెట్టిన తెలంగాణ విజయ గర్జన సభను జయప్రదం చేయాలని ప్రతి గ్రామం నుండి , ప్రతి మున్సిపల్ వార్డు నుండి, 50 మంది చొప్పున కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, బయలుదేరి రావాలని ఆయన అన్నారు. వరంగల్లు విజయ గర్జన సభను జయప్రదం చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ తెరాస పార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, వార్డుసభ్యులు, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, పిఏసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, టిఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ, గ్రామాల అధ్యక్షులు, సభ్యులు, అనుబంధ కమిటీల అధ్యక్షులు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 28, అక్టోబరు 2021


## మోదీకి సంకటంగా యూపీ ఎన్నికలు

ఉత్తరప్రదేశ్‌లో రాజకీయాలపై బ్రాహ్మణవర్గాల ఆధిపత్యం ఎక్కువగా ఉన్నదని అక్కడి రాజకీయ పరిస్థితిని అధ్యయనం చేసిన వారెవరికైనా అర్థమవుతుంది. ఆ రాష్ట్ర రాజకీయాల్లో కేంద్రంగా ఉన్న బ్రాహ్మణులు స్వాతంత్ర్యానంతరం కొన్ని దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకే మద్దతునిచ్చారు. కాంగ్రెస్ తరఫున ముఖ్యమంత్రులుగా ఉన్న అయిదుగురూ బ్రాహ్మణులు కావడం ఇందుకు నిదర్శనం. యుపి తొలి ముఖ్యమంత్రి గోవింద్ వల్లభ్ పంత్ నుంచీ శ్రీపతి మిశ్రా వరకూ బ్రాహ్మణులే. కాని ఇప్పుడు బ్రాహ్మణులు దాదాపు భారతీయ జనతాపార్టీ వైపు ఉన్నారు. గోవింద్ వల్లభ్ పంత్ కుమారుడు కెసి పంత్ కాంగ్రెస్‌లో కొన్ని దశాబ్దాలు అధికారం అనుభవించారు. బోఫోర్స్ కుంభకోణం దుమారం చెలరేగుతున్న సమయంలో ఆయన రక్షణమంత్రిగా ఉన్నారు. బోఫోర్స్‌కు సంబంధించి కాగ్ నివేదికపై పార్లమెంట్‌లో చర్చ జరిగినప్పుడు ఆయన రాజీవ్ ప్రభుత్వాన్ని గట్టిగా వెనకేసుకువచ్చారు. అలాంటి వ్యక్తి 1998లో బిజెపిలో చేరారు. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి కెసి పంత్‌ను ప్రణాళికాసంఘానికి డిప్యూటీ చైర్మన్‌ను చేశారు. కెసి పంత్ భార్య ఇలా పంత్ కూడా బిజెపి తరపున పోటీ చేసి విజయం సాధించారు. మరో ముఖ్యమంత్రి హేమవతీ నందన్ బహుగుణ 1969లో కాంగ్రెస్ చీలినప్పుడు కమలాపతి త్రిపాఠీతో పాటు ఇందిరాగాంధీకి అండగా నిలిచారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీకి ఎదురు తిరిగారు. లక్నోలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌కు స్వాగతం పలికారు. ఆ తర్వాత స్వంత పార్టీ స్థాపించారు. ఆయన కుమార్తె రీటా బహుగుణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, యుపిసిసి అధ్యక్షురాలిగా పనిచేసినప్పటికీ పరిస్థితులు గమనించి బిజెపిలో చేరారు. ఆమె కుమారుడు విజయ్ బహుగుణ కూడా బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. అతడి కుమారుడు కూడా ప్రస్తుతం బిజెపిలో ఎమ్మెల్యేగా ఉన్నారు. మరో కాంగ్రెస్ ముఖ్యమంత్రి శ్రీపతి మిశ్రా కుమారుడు రాకేశ్ మిశ్రా కమలం నీడన చేరారు. కాంగ్రెస్ పార్టీకి కొన్ని దశాబ్దాలుగా విధేయంగా ఉన్న కమలాపతి త్రిపాఠీ కుటుంబం కూడా తర్వాతి కాలంలో కాంగ్రెస్‌కు దూరమయింది. ఆయన మనుమడు రాజేశ్ పతి త్రిపాఠీ, మునిమనుమడు లలితేశ్ త్రిపాఠీ ఇటీవలే తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. రాజీవ్‌గాంధీ, పి.వి. నరసింహారావులకు రాజకీయ కార్యదర్శిగా ఉన్న జితేంద్ర ప్రసాద తర్వాతి కాలంలో సోనియాగాంధీపై కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. ఆయన కుమారుడు జితిన్ ప్రసాద గత ఏడాది బిజెపిలో చేరి యోగీ ఆదిత్యనాథ్ మంత్రివర్గంలో మంత్రి పదవిని స్వీకరించారు. సంజయ్ గాంధీ చెప్పులు మోస్తానన్న మరో మాజీ ముఖ్యమంత్రి నారాయణ్ దత్ తివారీ తన సతీమణితో సహా చరమ దశలో కాషాయ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు కాంగ్రెస్‌కు ప్రమోద్ తివారీ వంటి ఒకరిద్దరు బ్రాహ్మణ నేతలు తప్ప ఎవరూ మిగల్లేదు. ఈ నేపథ్యంలో, ఉత్తరప్రదేశ్‌లో, ఇటీవలి కాలంలో సుడిగాలిలా పర్యటనలు చేస్తూ లఖీంపూర్ ఖేరీతో సహా ఎక్కడ దారుణాలు జరిగినా అక్కడికి వెళుతున్న ప్రియాంకా వాద్రా గాంధీ భారతీయ జనతాపార్టీ నుంచి బ్రాహ్మణులను ఎంతమేరకు కాంగ్రెస్ వైపు తిప్పుకోగలరు? సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్, బహుజన సమాజ్ పార్టీ నేత మాయావతి కూడా బ్రాహ్మణుల సమ్మేళనాలను నిర్వహిస్తున్న తరుణంలో కాంగ్రెస్ ఆ వర్గాన్ని ఏ విధంగా ఆకర్షించగలదు? యుపిలో దళితులు, యాదవుల తర్వాత బ్రాహ్మణులు పెద్దసంఖ్యలో, దాదాపు 12 శాతం మేరకు ఉన్నారు. వారు ఎటువైపు ఉంటే అక్కడ విజయావకాశాలను ప్రభావితం చేయగలరని రాజకీయ పరిశీలకుల అంచనా. రామజన్మభూమి ఉద్యమం పుంజుకుంటున్న కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్ బలహీనంగా మారింది. ఆ తర్వాతి కాలం నుంచి ఏ పార్టీ పూర్తి మెజారిటీ సంపాదించలేదు. ఇందుకు ప్రధాన కారణం బ్రాహ్మణులు బిజెపి వైపు మొగ్గు చూపడమే. కాని 2007 అసెంబ్లీ ఎన్నికల్లో మాయావతి బ్రాహ్మణులకు ప్రాధాన్యం పెంచడంతో బిఎస్‌పి మెజారిటీ సీట్లు సాధించింది. కాని 2014 ఎన్నికల్లో మోదీ సారథ్యంలో బిజెపి ప్రభంజనం వీయడంతో పరిస్థితులు మారిపోయాయి. ఈ ఎన్నికల్లో 72 శాతం బ్రాహ్మణులు బిజెపికి ఓటు వేయడంతో ఆ పార్టీలు దాదాపు 40 శాతం ఓట్లను సాధించగలిగింది. 2017, 2019 ఎన్నికల్లో కూడా ఈ పరిణామం కొనసాగింది. ఈ ఎన్నికల్లో 80 నుంచి 82 శాతం బ్రాహ్మణ ఓట్లు బిజెపికి లభించాయి. అప్పటి నుంచీ బిజెపి బ్రాహ్మణ ఓట్లు యదాతథంగా ఉండగా, సమాజ్ వాది పార్టీ యాదవులు, ముస్లింల ఓట్లపై, బిఎస్‌పి దళితుల ఓట్లపై ఆధారపడసాగాయి. బ్రాహ్మణ ప్రాధాన్యాన్ని గుర్తించినందువల్లే బిజెపి సాధ్యమైనంతమేరకు ఇతర పార్టీలనుంచి వారిని తమ వైపుకు లాగడం ప్రారంభించింది. యోగీ ఆదిత్యనాథ్ తాజా మంత్రివర్గ విస్తరణ తర్వాత ఆయన మంత్రివర్గంలో బ్రాహ్మణుల సంఖ్య ఆరుగురికి పెరిగింది. ఒక అంచనా ప్రకారం ఇటీవల లఖీంపూర్ ఖేరీలో రైతులపై వాహనం తొక్కించి నలుగురి మరణానికి కారణమైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా అరెస్టుకు పోలీసులు వెనుకాడడానికి, అజయ్ మిశ్రాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించకపోవడానికి, వారిని బిజెపి నేతలు పల్లెత్తు మాట కూడా అనకపోవడానికి ప్రధాన కారణం వారు బ్రాహ్మణవర్గానికి చెందిన వారు కావడమే. 2013లో ముజఫర్‌నగర్ మతకల్లోలాలు, 2019లో పుల్వామా బాలాకోట్ ఘటనలు ఉపయోగపడితే ఈ ఎన్నికలకు ముందు అయోధ్యలో రామమందిరనిర్మాణం తమకు అనుకూలంగా పరిణమిస్తుందని బిజెపి విశ్వసిస్తోంది. మత మార్పిడి నిషేధ చట్టం, జనాభా నియంత్రణ చట్టం, అలహాబాద్‌ను ప్రయాగ్‌రాజ్‌గా మార్చడం, అలీఘడ్‌ను హరిఘడ్‌గా మారుస్తాననడం, తాజాగా ఫైజాబాద్ స్టేషన్‌ను అయోధ్య కంటోన్మెంట్ స్టేషన్‌గా మార్చడం మత ప్రాతపదికన ఓట్లను చీల్చేందుకు చేసే ప్రయత్నాలుగానే పరిశీలకులు భావిస్తున్నారు. పైగా యోగీ ఆదిత్యనాథ్ అద్భుతంగా ఒక వర్గం వారిని రెచ్చగొట్టడంలో దిట్ట. 2017కు ముందు 'అబ్బాజాన్' లకే అధిక ప్రయోజనాలు దక్కాయని ఆయన ఒక ప్రసంగంలో అనడం ద్వారా సమాజ్ వాది పార్టీ హయాంలో ముస్లింలే లాభపడ్డారన్న సంకేతాన్ని జనానికి అందించారు. మరో వైపు అప్నాదళ్, నిషాద్ పార్టీ, సుహల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ వంటి వాటితో పొత్తు పెట్టుకోవడం ద్వారా బిజెపి ఓబీసీలను కూడా చీల్చగలిగింది. ఇప్పుడు ఈ ఎన్నికల్లో బిఎస్‌పి ఓట్లను చీల్చేందుకు కూడా బిజెపి వ్యూహం రచించింది. ఉత్తరాఖండ్ మాజీ గవర్నర్‌గా ఉన్న బేబీ రాణీ మౌర్యను రంగంలోకి దించారు. నిజానికి 2017 ఎన్నికల్లోనే యుపి అసెంబ్లీలోని 403 సీట్లలో 85 రిజర్వుడు సీట్లుకాగా వాటిలో బిజెపి 75 సీట్లను గెలుచుకుంది. ఇదే ఎన్నికల్లో దాదాపు 150 మంది యాదవేతర ఓబీసీలకు సీట్లు ఇచ్చి వారి ఓట్లను చీల్చింది. యుపిలో దాదాపు 16 చిన్నా చితక పార్టీలు ఎన్నికల బరిలో దిగడం ఆ పార్టీకి ప్రయోజనమే కాని నష్టం లేదని రాజకీయవర్గాల అంచనా. ఈ వ్యూహాల వల్లే యుపిలో దాదాపు 25శాతం ముస్లింలు ఉన్నప్పటికీ బిజెపి పూర్తిగా హిందూ ఓట్లతో విజయం సాధించగలిగింది.

## డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ హిందూ, ఇస్లాం, క్రైస్తవ మతాలను కాదని బౌద్ధాన్ని ఎందుకు స్వీకరించారు?

బుద్ధుడు తన మతం సతత హరిత వనంలా ఎల్లవేళలా సేవ చేయదగినదిగా ఉండాలని కోరుకున్నాడు. అందుకే ఆయన తన అనుచరులకు అవసరాలకు అనుగుణంగా స్వేచ్ఛను ఇచ్చారు. మరే ఇతర మత గురువు ఇంత ధైర్యం చూపించలేదు. విశ్వాసాలకు, అభిప్రాయాలకు మరమ్మత్తులను అనుమతించడం గురించి వారు భయపడ్డారు, ఎందుకంటే మరమ్మత్తులు చేసే స్వేచ్ఛ వారు పెంచిన నిర్మాణాన్ని కూల్చివేయడానికి ఉపయోగించబడవచ్చు. బుద్ధుడికి అలాంటి భయం లేదు. అతను తన పునాదిపై ఖచ్చితంగా ఉన్నాడు. అత్యంత హింసాత్మక ప్రతిమ కూడా తన మతం యొక్క ప్రధాన భాగాన్ని నాశనం చేయదని అతనికి తెలుసు."లిబౌద్ధమతాన్ని హిందూమతంతో పోలుస్తూ అంబేడ్కర్ ఇలా వ్రాశాడు, "హిందూత్వం అనేది నైతికతపై స్థాపించబడని మతం. నైతికత అనేది ఒక ప్రత్యేక శక్తి, ఇది సామాజిక అవసరాల ద్వారా కొనసాగుతుంది మరియు హిందూ మతం యొక్క ఆజ్ఞ ద్వారా కాదు. బుద్ధుని మతం నైతికతే ప్రధానంగా మతంలో ఇమిడి ఉంది. బౌద్ధమతంలో దేవుడు లేడనేది నిజం. దేవుని స్థానంలో నైతికత ఉంది. ఇతర మతాలకు దేవుడు ఎలా ఉంటాడో, బౌద్ధమతానికి నైతికత ఉంది.డాక్టర్ అంబేడ్కర్ హిందూత్వ ధర్మానికి మరియు బౌద్ధంలోని 'ధమ్మం' మధ్య తేడాను చూపారు. హిందూ ధర్మం ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ, ఒక కులం ఎక్కువ, మరొక కులం తక్కువ అన్న భావన చెపుతుంటే, బౌద్ధంలోని ధమ్మం స్వేచ్ఛ, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని తెలియజేస్తుంది. డాక్టర్ అంబేడ్కర్ ఈ విషయాన్ని రాజ్యాంగంలో పొందుపరచడం కూడా జరిగింది. హిందూ "ధర్మం" ఏ కోణంలోనైనా నైతికతను సూచించలేదు. బ్రాహ్మణులచే ప్రకటించబడిన ధర్మం అంటే కొన్ని కర్మలు లేదా ఆచారాలు, యాగాలు మరియు దేవుళ్లకు త్యాగాలు చేయడం తప్ప మరేమీ లేదు. బుద్ధుడు ఉపయోగించిన ధమ్మ పదానికి ఆచారాలతో సంబంధం లేదు. కర్మ స్థానంలో, బుద్ధుడు నైతికతను ధమ్మం యొక్క సారాంశంగా మార్చాడు.హిందూ మతం యొక్క బావజాల సువార్త అసమానతలపై ఒకడు ఎక్కువ, మరొకడు తక్కువపై ఆదారపడింది. హిందూ మతం మరియు బౌద్ధమతం యొక్క పోలికలను మరింత ముందుకు తీసుకెళ్లి, డాక్టర్ అంబేడ్కర్ రెండవ వ్యత్యాసం గురించి ఇలా వ్రాశాడు: "హిందూ మతం యొక్క అధికారిక సువార్త అసమానత అనే వాస్తవం యొక్క రెండవ అంశం విరుద్ధంగా ఉంది. మరోవైపు, బుద్ధుడు సమానత్వం కోసం నిలబడ్డాడు. అతను చాతుర్వర్ణానికి గొప్ప ప్రత్యర్థి. చాతుర్వర్ణం కుల వ్యవస్థకు మాతృమూర్తి. స్పష్టంగా అది శాశ్వతంగా ప్రజలకు ప్రాణాలకు నష్టం కలిగిస్తుంది. బుద్ధుడు వర్ణవ్యవస్తకు వ్యతిరేకంగా బోధించడమే కాకుండా, దానికి వ్యతిరేకంగా పోరాడి, వర్ణవ్యవస్తను నిర్మూలించడానికి ప్రతి పని చేశాడు. హిందూ మతం ప్రకారం శూద్రుడు లేదా ఏ స్త్రీ అయినా మతాన్ని బోధించలేరు లేదా వారు సన్యాసం స్వీకరించి భగవంతుడిని చేరుకోలేరు. మరోవైపు బుద్ధుడు శూద్రులను భిక్షు సంఘంలో చేర్చుకున్నాడు. అతను స్త్రీలను కూడా భిక్షువులుగా మార్చాడు.అంబేద్కర్ అసమానత సువార్తపై బుద్ధుని దాడి ఫలితంగా, "హిందూమతం దాని సిద్ధాంతాలలో అనేక మార్పులు చేయవలసి వచ్చింది. అది హింసను పేరుకు మాత్రమే వదులుకుంది. వేదాలలోని అనేక తప్పులను ఎత్తిచూపిస్తున్నారు. చాతుర్వర్ణ విషయానికొస్తే, బ్రాహ్మణిజం వదులుకుంటానికి సిద్ధపడలేదు. బుద్ధుడు చాతుర్వర్ణ సిద్ధాంతానికి తన పూర్తి వ్యతిరేకతను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. అందుకే బ్రాహ్మణిజం జైనమతంపై కంటే బౌద్ధమతంపై ఎక్కువ ద్వేషం మరియు విరోధాన్ని కలిగి ఉంది.

(మిగతా భాగం రేపటి సంచికలో..)

# ఎ.పి లో చిచ్చు, బిజెపి ఉచ్చు



చైతన్యవంతమైన రాజకీయాలకు పేరెన్నిక గన్న తెలుగు ప్రజలు ఈ బూతు పురాణాలు, ఉద్రిక్తతలు సహించలేకపోతున్నారు. ఎక్కడ ఎవరిని కలిసినా ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఎ.పి లో కుల ఘర్షణలు సృష్టించిన విధ్వంసం వారింకా మర్చిపోలేదు. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం మరోసారి కుల మత చిచ్చును ఎగదోసే ప్రయత్నాలు వారికి ఆందోళన కలిగిస్తున్నాయి. వైసీపీ, టీడీపీ, జనసేనలు బిజెపి చెలగాటంలో చిక్కిన ఫలితంగా దారుణంగా దగాపడిన ఈ రాష్ట్రం ఏకంగా రాష్ట్రపతి పాలన లోకి పోవాలని కోరడం బాధ్యతా రహితం. అదే సమయంలో జగన్ ప్రభుత్వం ప్రతిపక్షాల విమర్శలు ప్రజా ఉద్యమాలను స్వీకరించలేకపోవడం, ప్రతి దానికి పోలీసులను ప్రయోగించడం కేసులు బనాయించడం అప్రజాస్వామికం. ఈ పోటాపోటీలో రాష్ట్ర రాజకీయ ఎజెండా దారి తప్పడం అనుమతించరానిది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు అందులోనూ పాలక పార్టీల వ్యవహారాలు అంతకంతకూ అధ్వాన్నంగా మారుతున్నాయి. పాలక పక్షమైన వైసీపీ, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి మధ్య అధికార పోటీలో అసహనాలు పరాకాష్టకు చేరి అసలు సమస్యలు తెరమరుగై అవాంఛనీయ ద్వేషావేశాలు పరాకాష్టకు చేరుతున్నాయి. అనవసర వివాదాలు, అసభ్య భాషా ప్రయోగాలు భరించలేని స్థాయిని అందుకోవడమే గాక రాజకీయ రాజ్యాంగ సవాళ్లుగా పరిణమిస్తున్నాయి. గత మంగళవారం నాడు తెలుగుదేశం అధికార ప్రతినిధి ఉపయోగించిన ఒక అనుచితమైన మాటతో రగిలిన మంటలు రాష్ట్రపతి భవన్ వరకూ వెళ్లడం చరిత్రలో ఎరగని విపరీతం. విభజిత రాష్ట్రానికి రావలసిన నిధులు, ప్రత్యేక హోదా, అపరిష్కృత విభజన సమస్యలు, పోలవరం పూర్తి, వెనకబడిన ప్రాంతాల నిధులు, అమరావతి ప్రతిష్టంభన, విశాఖ ఉక్కు అమ్మకం నిలిపివేత వంటి అత్యవసర అంశాల ఊసే పట్టనట్టు రెండు ప్రధాన పార్టీలు పరస్పర దూషణలో మునిగి తేలుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్ అరాచక పాలన, నేరస్త నేపథ్యం, సిబిఐ కేసులు అన్నవి టిడిపి నిరంతర విమర్శలైతే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాడు మామ ఎన్టీఆర్‌ను గద్దె దింపడంతో సహా పాత చరిత్రనంతా తవ్వి తీయడం వైసీపీ కార్యక్రమంగా కొనసాగుతున్నది. దార్శనికుడైన చంద్రబాబు పాలన స్వర్గతుల్యమైనా ప్రజలు ఆయనను ఓడించి తప్పు చేశారనేది టిడిపి వాదన. ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు వదలించుకోవడమా అనేదే ఇప్పుడు సమస్య అని టిడిపి అంటుంది. జమిలి ఎన్నికలు వచ్చేస్తాయని లేదంటే జగన్ జైలుకు వెళతారు గనక ఈ పాలన సాగదని చాలా కాలం చెబుతూ వచ్చింది. ఇక వైసీపీ విషయానికి వస్తే తమ సంక్షేమ పథకాలు నభూతో నభవిష్యతి గనక వీటిని ప్రసాదిస్తున్న ముఖ్యమంత్రిని పల్లెత్తు మాట అన్నా సహించేది లేదన్న వైఖరితో నడుస్తున్నది. తమ ప్రభుత్వాన్ని అస్థిరత్వం పాలు చేసేందుకు టిడిపి వ్యూహాత్మకంగానే కుట్రలు పన్నుతున్నదని ఆరోపిస్తుంది. వీటిని వమ్ము చేయడం కోసం టిడిపి నాయకుల, కార్యకర్తల స్థయిర్యం దెబ్బ తీయడం వైసీపీ విధానంగా వుంది. వారి పాలన నాటి విషయాలపై కేసులు పెట్టి అరెస్టులు చేయడం, కోర్టుల చుట్టూ తిరగడం, అక్కడ వ్యతిరేక తీర్పులు వస్తే ఉడుక్కోవడం తంతుగా తయారైంది. ఈ క్రమంలోనే టిడిపి అనుకూల మీడియాతో పాటు కోర్టులూ, రాష్ట్ర ఎన్నికల సంఘం లాంటి వ్యవస్థలపై కూడా పాలకపక్షం అసహనం వ్యక్తం చేస్తున్నది. చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తారనేది వైసీపీ ఆరోపణ కాగా జగన్ ప్రభుత్వం వ్యవస్థలను ధ్వంసం చేస్తుందనేది టిడిపి అభియోగం. వీటిపై తిట్లు, సిగ పట్లు నిత్యకృత్యమై పోగా మీడియా కూడా వాటిని గొప్పగా ప్రచారంలో పెడుతున్నది. రెండు పార్టీలు కేంద్ర బిజెపిని మంచి చేసుకోవడం తప్ప రాష్ట్ర ప్రయోజనాలకు కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని నిలదీయడమనే ప్రశ్న లేకుండా పోయింది.

### ఒక్క బూతుమాటతో మంటలు

ఏతావాతా ఈ రెండేళ్ల లోనూ కొద్ది రోజుల అరెస్టులు, కేసులు, కొన్ని రోజులు కూల్చివేతలు, కొన్ని రోజులు అప్పుల లెక్కలు, కొన్ని రోజులు సోషల్ మీడియా పోస్టులు ఇలా ఏదో ఒక తాత్కాలిక అంశంపై కృత్రిమంగా కేంద్రీకరణ పరిపాటిగా మారింది. ఈ క్రమంలో ఇటీవల గుజరాత్ లోని ముంద్రా రేవులో వేల కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలు పట్టుపడటం, వాటిపై విజయవాడ చిరునామా వుండటం కొత్త వివాదంగా మారింది. వాస్తవంలో ఉమ్మడి ఎ.పి లోనూ విడిపోయాక గత ఏడేళ్ల లోనూ మాదక ద్రవ్యాలు, ప్రత్యేకించి గంజాయి ఒక సమస్యగా వుంది. హైదరాబాదులో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన వారిపై విచారణ కూడా జరిగింది. 2013 నుంచి 2020 వరకూ పలు సందర్భాల్లో ఇతర రాష్ట్రాల పోలీసులు ఎ.పి కి వచ్చి దర్యాప్తు చేసుకుని వెళ్లారు. ఇప్పుడు గుజరాత్‌లో దొరికిన మాదక ద్రవ్యాలపై ఎ.పి చిరునామా వున్నా వాటి యజమానులు చెన్నైలో వున్నారని తేలింది. పైగా అది అదానీ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రైవేటు రేవు. రవాణా చేయడం తప్ప ఎగుమతి దిగుమతుల తనిఖీతో తమకు సంబంధం లేదని అదానీ గ్రూపు ప్రకటించింది. కేంద్రం తరపున ఈ బాధ్యత చూడవలసిన డిఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్) పెద్దగా స్పందించలేదు. కాని ఎ.పి లో మాత్రం ఇదే దుమారానికి కారణమైంది. వైసీపీ నేతలకు డ్రగ్ మాఫియాతో సంబంధాలున్నాయని టిడిపి ఆరోపించగా వారి వివరాలు అందించాలని పోలీసులు ఆ పార్టీ నేతలకే నోటీసులు జారీ చేశారు. దీనిపై మాట్లాడే సందర్భంలోనే టిడిపి నేత పట్టాభి అనరాని మాట అనేక సార్లు అన్నారు. దాన్ని సాకుగా చేసుకుని వైసీపీ కార్యకర్తలు ఆయన ఇంటి పైన, టిడిపి కేంద్ర కార్యాలయంపైనా పలు జిల్లాలలో ఆఫీసుల పైన దాడి చేశారు. టిడిపి నేత రెచ్చగొట్టడానికే ముఖ్యమంత్రిపై ఆ పదం వాడారని వైసీపీ అంటే...వారు ముందే పథకం వేసుకుని దాడులు చేశారని టిడిపి అంటుంది. దీనిపై చంద్రబాబు 36 గంటల నిరాహారదీక్ష చేస్తే వైసీపీ రాష్ట్ర వ్యాపితంగా ప్రజాగ్రహ దీక్షలు చేసింది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి జగన్ తనను తిట్టారంటూ ఆ బూతు పదాన్ని పోలీసు సమ్మేళనంలో వినిపించారు. ఇక చంద్రబాబు దీక్షలో ఆ మాట పదేపదే వాడారు. దానికి తప్పు అర్థమే లేదని నిఘంటువులు, గూగుల్లు ఉదహరించారు. ఇదంతా భరించలేని స్థాయిలో నడుస్తుండగా పట్టాభి ఇంటి తాళాలు పగలగొట్టి అరెస్టు చేశారు. దాడులకు సంబంధించి కూడా పదిహేను మంది వరకూ అరెస్టు చేశారు. అయితే సిఆర్‌పిసి 41ఎ కింద నోటీసు ఇవ్వకుండా పట్టాభిని అరెస్టు చేయడం సరికాదని మూడో రోజున హైకోర్టు విడుదల చేయడంతో మళ్లీ కోర్టులపై వివాద వ్యాఖ్యలు వినిపించాయి (ఇప్పుడాయన నిగూఢ ప్రదేశానికి వెళ్లారంటున్నారు). కార్యాలయాలపై శాంతి భద్రతలు కుప్ప కూలాయి గనక రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన పెట్టాలని టిడిపి అంటే అసలు ఆ పార్టీనే రద్దు చేయాలని వైసీపీ వాదించింది. దీక్షలు ముగిసినా కక్షలు మిగిలాయన్నట్టు చంద్రబాబు వెంటనే ఢిల్లీలో రాష్ట్రపతిని కలిసి 356 కింద జగన్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరారు. తమ కార్యాలయాలపై దాడుల మీద సిబిఐ విచారణ జరిపించాలని అరెస్టులు, కేసులు, పోలీసు హింసల పైనా విచారణ జరపాలని కోరారు. పాలకపక్షం ఏజంటుగా వ్యవహరిస్తున్న డిజిపి గౌతం సవాంగ్‌ను వెనక్కు పిలిపించాలని కూడా అడిగారు. రాష్ట్రపతి పాలన కోరడం తీవ్రమైన విషయమని తెలుసు గనక దాన్ని సమర్థించుకోవడానికి టిడిపి పలు వాదనలు సిద్ధం చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదం నడుస్తున్నదనీ, డ్రగ్ మాఫియాకు తాలిబాన్లతో సంబంధాలున్నాయనీ, రాజ్యాంగ వ్యవస్థలే కుప్పకూలాయని పేర్కొంది.

### తప్పును మించి తప్పులు

ఏది ఏమైనా వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను ఖండించేవారు కూడా ముఖ్యమంత్రిపై అసభ్య భాష వాడటాన్ని సమర్థించలేరు. ఆ బూతులు ఖండించేవారు కూడా టిడిపి కార్యాలయాలపై దాడులు ఆమోదించరు. ఆ దాడులు ఖండించేవారు కూడా ఆ పేరుతో రాష్ట్రపతి పాలన ఆహ్వానించడాన్ని అసలు సమర్థించరు. 2018లో ధర్మయుద్ధం పేరిట కేంద్రం వైఖరికి వ్యతిరేకంగా తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు ఆ కేంద్రం పాలనను ఆహ్వానించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ కాలంలో కేంద్రం మరింత నిరంకుశంగా మారి రాష్ట్రాలపై దాడులు పెంచింది. ప్రజాస్వామ్యంలో రాష్ట్రాల హక్కులు కీలక స్థానం వహిస్తాయి. ఎ.పి ని ప్రత్యేకంగా అలక్ష్యం చేసిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు విశాఖ ఉక్కును కూడా అమ్మకానికి పెట్టింది. ఎ.పి కి జరిగిన వంచనకు వ్యతిరేకంగా కేంద్రంపై కలిసి పోరాడవలసిన రెండు ప్రధాన పార్టీలు నిరంతర నిరర్థక తగాదాలతో ఆ కేంద్రం చేతుల్లో జుట్టు పెట్టడం, మోడీ మోతలో పోటీ పడటం దారుణం.

# 20 ఏళ్ల టిఆర్ఎస్ కు మద్దతు... ఏడేళ్ల పాలన సీఎం కేసీఆర్ కు సత్తా చాటుదాం



బాలాపూర్:అక్టోబరు 27, ప్రజాపాలన ప్రతినిధి: మహేశ్వరం నియోజకవర్గ ప్రజలందరూ కదం తొక్కుతూ కదిలి రండి విజయ్ గర్జన లో గార్జిద్దాం.. అని పిలుపునిచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. నవంబర్15న వరంగల్లో జరుగనున్న విజయ్ గర్జన బహిరంగ సభ విజయవంతం కోసం బుధవారం బడంగ్ పేట కార్పొరేషన్ పరిధిలోని పెద్ద బావి మల్లారెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన మహేశ్వరం నియోజకవర్గం విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం కార్పొరేషన్ రామిడి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి తో పాటు మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి జిల్లా చైర్పర్సన్, పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. సభ ప్రాంగణంలో టిఆర్ఎస్ పార్టీ జెండా ను ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ శాంతి కొరకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ.... తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారం చేసుకోవడానికి టిఆర్ఎస్ పార్టీ కి మద్దతు తెలపాలని అన్నారు. అవకాశవాద పార్టీ లకు బుద్ధి చెప్పాలన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్, ధరలు పెంచిన బిజెపికి రేపు జరిగే హుజురాబాద్ 30వ తారీఖున ప్రజలు బుద్ధి చెప్పాలని,టిఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతూ లక్షలాది మంది నీ ప్రభుత్వ ఉద్యోగాలను రోడ్డున పడవేస్తున్న బిజెపికి ఉప ఎన్నికల్లోనూ పరాభవం తప్పదు అన్నారు. వరంగల్ విజయ గర్జన కు ప్రతి గ్రామం ప్రతి డివిజన్ నుండి ఒక బస్సు డివిజన్ ెపరం, మహేశ్వరం నియోజకవర్గము అని ప్రతి బస్ పై స్టిక్కర్ లు ఉండాలి అన్నారు.అమ్మాకానికి మారు పేరు అయిన బీజేపీ కి తగిన బుద్ధి చెప్పు,నమ్మకానికి మారు పేరు అయిన తెలంగాణ రాష్ట్ర సమితి కి పట్టం కట్టలన్నారు.నవంబర్ 15 న 8 గంటల వరకు ప్రతి గ్రామంలో, ప్రతి డివిజన్ లో పార్టీ జెండా ఎగురవేసి,8:30 గంటల వరకు మండల కేంద్రానికి,కార్పొరేషన్లలో ముఖ్య కేంద్రాలకు చేరుకోవాలినీ చెప్పారు. 11 గంటల వరకు భ్రమరాంబ ఫంక్షన్ హాల్ కు చేరుకొని భోజన చేసి,అక్కడనుండి వరంగల్ లో విజయ గర్జన సభకు బయలుదేరుదామని అన్నారు. ప్రతి బస్ లో 50 మంది టిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలే వచ్చేలాచూసే బాధ్యత వివిధ విభాగాల అధ్యక్షుల బాధ్యత తీసుకోవాలని చెప్పారు. కార్లలో వద్దు అందరం బస్ లలోనే వెలుదాం మంత్రి కూడా బస్ లోనే ఇస్తానని చెప్పారు.తెలంగాణ ఉద్యమ కారులను గౌరవించాలని,తన కంటే ముందు వారిని వేదిక పై పిలివాలి అన్నారు. పార్టీ ప్లీనరీ విహాయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు... అదే స్ఫూర్తితో విజయ గర్జనను దిగ్విజయం చేయాలని విద్యా శాఖ మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి,రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, మాజి ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పాండురంగారెడ్డి, మీర్పేట్ కార్పొరేషన్ మేయర్లు దుర్గా దీప్ లాల్ చౌహన్, బడంగ్పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నరసింహ్మా రెడ్డి,యువ నేత పి. కౌశిక్ రెడ్డి,డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఎంపీపీ,జడ్పీటీసీ లు,మార్కెట్ చైర్ పర్సన్ వరలక్ష్మి, సహకార సొసైటీ చైర్మన్లు, కార్పొరేషన్ల పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి,కామేష్ రెడ్డి ,డివిజన్ ల అధ్యక్షులు,మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేతలు జిల్లెల కృష్ణారెడ్డి,బేర బాలకిషన్,యువజన విభాగం అధ్యక్షులు కొండల్ రెడ్డి,వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గాలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, వార్డు సభ్యులు, సొసైటీ డైరెక్టర్లు,నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## నవంబర్ 1న జరిగే అఖిల భారత నిరసన దినంను విజయవంతం చేయండి: టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వి.రాంబాబు

బోనకల్, అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి: విద్యలో అంతరాలను పెంచే ఎన్ ఈ పి 2020 అమలును నిలిపివేయాలని, సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, పెట్రోలియం ఉత్పత్తుల ధరలను నియంత్రించాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గెస్ట్, పార్ట్ టైం తదితర తాత్కాలిక ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, కోవిడ్ తో మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకోవాలని, దేశవ్యాప్తంగా పాఠశాలల్లో ప్రత్యక్ష బోధనను ప్రారంభించాలని తదితర డిమాండ్లతో దేశవ్యాప్తంగా నవంబర్ 1న ఆల్ ఇండియా ప్రొటెస్ట్ డే నిర్వహించాలని ఎస్ టి ఎఫ్ ఐ కేంద్ర కార్యవర్గం పిలుపునిచ్చింది.ఆమేరకు ఎస్ టి ఎఫ్ ఐ అనుబంధ సంఘంగా టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలక్టరేట్ ల వద్ద నవంబర్ 1 సాయంత్రం 4.00 గంటలకు నిరసన తెలిపి జిల్లా కలెక్టర్ ద్వారా భారత రాష్ట్రపతికి మెమోరాండమ్ పంపించాలి.ఈ నిరసన ప్రదర్శనల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరుతున్నాము. ఈకార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు కంభం రమేష్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, మండల ఉపాధ్యక్షురాలు పి.సుశీల, ఉపాధ్యక్షులు యం.సి.చంద్రప్రసాద్,పి. పుల్లారావు, పి.గోపాల్ రావు, బి.శ్రప్రీతమ్,ఏ.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిల్కానగర్ డివిజన్లో అక్రమ నిర్మాణాలను కూల్చి వేసిన జిహెచ్ఎంసి అధికారులు



మేడిపల్లి, అక్టోబర్ 27 (ప్రజాపాలన ప్రతినిధి) :చిల్కానగర్ డివిజన్లో అక్రమ నిర్మాణాలను జిహెచ్ఎంసి అధికారులు కూల్చివేశారు. డివిజన్లో జి ప్లస్ వన్ పర్మిషన్ తీసుకుని అక్రమంగా మరో ఫ్లోర్ ఫ్లోర్ పైన పెంట్ హౌస్, కింద సెంటర్స్ వేస్తున్న రెండు ఇండ్లను బుధవారం నాడు అధికారులు కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని అధికారులు పేర్కొన్నారు.

## వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ కొరకు అవగాహన సదస్సు



బోనకల్ , అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి: మండల కేంద్రంలోని వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ కొరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈరోజు సమావేశం ఏర్పాటు జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఈఓ కే చంద్రశేఖర్ పాల్గొనడం జరిగింది. అనంతరం డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లోని వ్యాక్సినేషన్ విజయవంతంగా సాగాలని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు మరియు గ్రామాల ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లో డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్, మండల తాసిల్దార్, మండలంలోని గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్స్, అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



బోనకల్, అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి: కేంద్రం ప్రవేశపెట్టిన రైతు నల్ల చట్టాలను రద్దు చేయాలని పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, కరోనా బారిన పడి చనిపోయిన వారికి తగిన న్యాయం చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రావినూతల సిపిఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు మండల కమిటీ సభ్యులుగుగులోతు నరేష్,గుగులోతు. పంతులు, ఉల్లి నరేష్, సిపిఎం నాయకులు గండు సైదులు, దొండపాటి సత్యనారాయణ, యర్రగా నాగరాజు, కొంగర భూషయ్య, మందా వీరభద్రం, యర్రగాని, నాగేశ్వరరావు జోయిన బోయిన గురవయ్య, పఠాన్ అఫ్జల్, అజ్మీరా.గోపి భానోత్ నాగేశ్వరరావు,, వట్టికుంట రమేష్, మరుదు.వెంకటేశ్వర్లు, మరీదు.వెంకన్న, బోయినపల్లి నాగ తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటరు జాబితాను నవంబర్ 1న విడుదల చేసేలా చర్యలు

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి శశాంక్ గోయల్



మంచిర్యాల బ్యూరో, అక్టోబర్ 27, ప్రజాపాలన :ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం - 2022 (ఎస్.ఎస్.ఆర్.) ముసాయిదా ఓటరు జాబితాను నవంబర్ 1న అన్ని జిల్లాలలో విడుదల చేసే విధంగా చర్యలు తీసుకో వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి శశాంక్ గోయల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుండి ఎస్.ఎస్. ఆర్-2022 పై వీడియో కాన్ఫరెన్సు ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ సెప్టెంబర్, 30వ తేదీ వరకు వచ్చిన ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు తదితర దరఖాస్తులను పరిష్కరించి నవంబర్ 1న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించాలని, అట్టి ప్రతులను అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని, పేర్కొన్నారు. ఓటర్లకు జాబితాలో ఏమైనా మార్పులు, చేర్పులు, ఫోటో లేకపోవడం ఇతరత్రా సమస్యలు ఉంటే దరఖాస్తులు స్వీకరించి నవంబర్ 2 నుండి సరిచేసే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ఓటర్ల అభ్యంత రాలను పరిష్కరించి 2022 జనవరి, 5 న తుది ఓటరు జాబితాను ప్రచురించాల్సిందిగా సూచించారు. ఓటర్ల చిరునామా మారడం, పోలింగ్ కేంద్రం వేరే చోటికి మార్చవలసినవి, అదనపు పోలింగ్ కేంద్రాలు అవసరం ఉన్న ప్రాంతాలలో స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి ఆమోదంతో తగు మార్పులకు సిఫారసు చేయవచ్చని తెలిపారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటర్ల వివరాల మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం గరుడ యాప్ను అందుబాటులో ఉంచడం జరిగిందని, ఈ యాప్ వినియోగంపై బూత్ స్థాయి అధికారులకు పూర్తి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ఈ.వి.యం.లు పాత గోదాముల నుండి కొత్త గోదాములకు మార్చాలని, ఇంకా నిర్మాణం పూర్తి చేయని జిల్లాల్లో త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ఈ.వి.యం.ల భద్రతపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని, అన్ని జిల్లాలలో స్వీప్ యాక్టివిటి నిర్వహించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత ప్రచారం నిర్వహించడం ద్వారా ఓటర్లను చైతన్యవంతులను చేయాలని తెలిపారు. జనవరి 1, 2022 నాటికి 18 సం?లు వయస్సు నిండిన ప్రతి ఒక్కరు ఆన్లైన్ ద్వారా కాని, ఫారం-6 ద్వారా కాని ఓటరు జాబితాలో తమ వివరాలను నమోదు చేసుకునే విధంగా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గత ఎన్నికలకు సంబంధించి ఖర్చు చేసిన ఎన్నికల బిల్లులు, డి.సి. బిల్లుల సమర్పణలో పెండింగ్ ఉంటే సత్వరమే దాఖలు చేయాలని తెలియజేసారు. జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి మాట్లాడుతూ జిల్లాలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్నాయక్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి వేణు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

### వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 26 ప్రజాపాలన ప్రతినిధి :రాష్ట్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్లో టిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. కరువు పీడిత ప్రాంతాలను విముక్తి చేసేందుకు సీఎం కేసీఆర్ సాగు, తాగునీరు



ప్రాజెక్టులకు రూపకల్పన చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, రాష్ట్ర యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ టిఆర్ఎస్ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బలదేవారెడ్డి, ముత్యంరెడ్డి, లక్ష్మారెడ్డి, పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలుకల బుగ్గరాములు, కర్నాటి రమేష్ గౌడ్, చీరాల రమేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు జెర్కొని రాజు, టిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు నిట్టు జగదీష్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ టిఆర్ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడే నిరసన కార్యక్రమం

### మల్రాజు శ్రీనివాసరావు బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు



బెల్లంపల్లి అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ లో భాగంగా సింగరేణిలో నాలుగు బొగ్గు గు బ్లాకులు వేలం వేసే ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస రావు అన్నారు.బుధవారంనాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరణకు అప్పజెప్పే తతంగాన్ని ఇప్పటికైనా మానుకోవాలని దానికి నిరసనగా గురువారం నాడు సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని బొగ్గు గనుల పైన, ఉపరితల గనుల పైన, వివిధ డిపార్ట్మెంట్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేసి స్థానిక అధికారులకు మెమోరాండం సమర్పిస్తామని ఆయన తెలిపారు.

## జాబితా అభ్యంతరాలపై ఫిర్యాదుల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి

మంచిర్యాల బ్యూరో, అక్టోబర్ 27, ప్రజాపాలన : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో వైద్యాధికారుల నియామక ప్రక్రియకు సంబంధించిన ప్రాథమిక జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక జాబితా జిల్లా అధికారిక వెబ్సైట్ https://mancherial.telangana.gov.in నందు పొందుపర్చడంతో పాటు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ నోటీసు బోర్డుపై ఉంచడం జరిగిందని, అభ్యర్థులకు ఇట్టి జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 29 నుండి 30వ తేదీ సాయంత్రం 5 గం?ల లోపు కార్యాలయ పని దినములలో వ్రాతపూర్వకంగా తగిన ధృవపత్రాలు జత చేసి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల బంధు అమలు చెయ్యాలి: బి.ఎస్.పి డిమాండ్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు. అక్టోబరు 27, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల బందు అమలుచేయాలని బి ఎస్ పి పార్టీ మండల అధ్యక్షులు తంబర్ల నరసింహారావు డిమాండ్ చేశారు జూలూరుపాడు మండలం స్థానిక ఎమ్మార్వో లూథర్ విల్సన్ కి మెమోరాండం ఇవ్వటం జరిగినది తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఎన్నో బాధలు పడుతూ ఉన్నారు వారికి ఇచ్చే 3016 రూపాయల పింఛన్ ఎటు సరిపోక ఏమి పని చేయలేక పూట గడవటం చాలా ఇబ్బంది పడుతున్నారు ఈ పరిస్థితిని గమనించి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే దివ్యాంగుల బందు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసి ప్రతి ఒక్క జిల్లాకు దివ్యాంగులకు సంబంధించిన ఒక ఆఫీస్ ని నియమించి వారి అవసరాల కొరకు ఆఫీస్ లో ఉన్న ప్రతి ఒక్క ఉద్యోగస్తుడు నీతి నిజాయితీగా పని చేసేటట్లు చూసి వీరి బాధలు తీర్ధవలసినదిగా కోరారు తెలంగాణ రాష్ట్ర సాధన లో వీరికి కాళ్లు లేకపోయినా కర్రలు సపోర్ట్ చేసుకొని రాష్ట్రం కోసం నిలబడి కొట్లాడి ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర వహించిన దివ్యాంగుల ను ఆదుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతైనా ఉందని అన్నారు వికలాంగులను వెక్కిరించిన ఏ ప్రభుత్వము నిలబడలేదు అని వారు అన్నారు కనుక ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల బందు అమలు పరచి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కును అందించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి అక్టోబర్ 27 ప్రజాపాలన ప్రతినిధి: బలహీన వర్గాల కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా కళ్యాణ లక్ష్మి ఉపయోగపడుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం నాడు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు కు చెందిన చింతకింది పద్మ, రాజం దంపతుల కుమార్తె రమ్యకు ఒక లక్ష 116 రూపాయల కళ్యాణ లక్ష్మి చెక్కును పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అందులో భాగమే ఈ కళ్యాణ లక్ష్మి పథకం కూడా ఒకటని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్వేతా శ్రీధర్, వైస్ ఛైర్మన్ బత్తుల సుదర్శన్, బెల్లంపల్లి తాసిల్దార్ కుమార స్వామి, డీ టి ప్రసాద్,టి. ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షులు బొడ్డు నారాయణ, మరియు గౌరవ మున్సిపల్ కౌన్సిలర్ సూరం.సంగీత బానేశ్, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.

## హుజూరాబాద్‌లో ఉద్యమ నేత కు ఊరూరా నీరాజనం



బాలాపూర్:అక్టోబర్27, ప్రజాపాలన ప్రతినిది : మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో హుజురాబాద్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం చివరి రోజున పెద్ద పాపయ్య పల్లి గ్రామంలో రంగారెడ్డి జిల్లా నాయకులు విస్తృత ప్రచారం చేశారు. 20 రోజులుగా ఆ గ్రామంలో గడప గడప తిరిగి ఓటర్లను ఆకర్షించేందుకు ఓటర్ల వేలాది అభిమానాన్ని చాటుకున్నారు. 60వ బూత్ స్థాయి ప్రచార బాధ్యతలు తీసుకొని గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓటర్లు చెప్పిన నాయకులు ఈటెల రాజేందర్ గెలిపుపై వ్యక్తం చేశారు. హుజురాబాద్ లో ఈటెలకు... ఎవరు ఎదురు లేరని ప్రజలు పలువురు చెప్పారు. 60వ బూతు స్థాయిలో ఉన్న ప్రజలందరికి భాజపా నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| గణేష్ | బాలాపూర్ | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| జి.వి. శైలజ | శేర్లింగంపల్లి | 8919627871 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492417684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| ఓ.వి.దుర్గారావు | భద్రాద్రి కొత్తగూడెం | 9581872881 |
| జె.రాంబాబు | అశ్వరరావుపేట | 9505678245 |
| బి.శ్రీకాంత్ | భద్రాచలం | 9398430470 |
| సి.సుధీర్‌కుమార్ | సుజాతనగర్ | 9701992529 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేదు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కె.సత్యం | పటాన్‌చెరు | 9866500289 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్యా.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నందు | ఎర్రుపాలెం | 7416156349 |


## రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి కి నిధులు: ఎమ్మెల్యే డా.సంజయ్



జగిత్యాల, అక్టోబర్, 27 ( ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల రూరల్ మండల లక్ష్మీ పూర్ గ్రామంలోని వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో 25 అడుగుల హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ నిర్వహించినారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలను, కులాలను గౌరవిస్తూ హిందు దేవాలయాలకు నిధులను ముఖ్యమంత్రి కేటాయిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రములో కొండగట్టు, ధర్మపురి, వేములవాడ, యాదాద్రి ఆలయాలకు నిధులను ప్రభుత్వం కేటాయించిందని, గత ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ దేవాలయాలు అభివృద్ధి కి నోచుకోలేదని అన్నారు. లక్ష్మీపూర్ వెంకటేశ్వర ఆలయానికి కూడా నిధులు మంజూరు కు వినతిపత్రాన్ని అందజేశారని తన వంతుగా నిధుల మంజూరుకు కృషిచేస్తానని అన్నారు.

## డిగ్రీ విద్యార్థులకు కోవిడ్ సెకండ్ డోస్ వ్యాక్సిన్ టీకాలు



కోరుట్ల,అక్టోబర్ 27 ( ప్రజాపాలన ప్రతినిధి ):కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రోజున డిగ్రీ విద్యార్థుల కోసం సెకండ్ డోస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు తనయులు డా.సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సెకండ్ డోస్ వ్యాక్సినేషన్ లను తీసుకున్నారు. ఈ సందర్భంగా డా.కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ప్రజలందరూ వ్యాక్సిన్ ను తప్పనిసరిగా తీసుకోవాలని,భౌతిక దూరాన్ని పాటించాలని, మాస్క్ లను తప్పనిసరిగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ అనూప్ రావు,పట్టణ అధ్యక్షుడు అన్నం అనీల్, ఎంపిపి తోట నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, పట్టణ కార్యదర్శి గుడ్ల మనోహర్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, కౌన్సిలర్లు, సర్పంచులు, కో అప్షన్, మెంబర్లు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : కార్పొరేటర్ హేమలత



హైదరాబాద్(ప్రజాపాలన సిటీ బ్యూరో) :ప్రజాసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు స్థానిక కార్పొరేటర్ హేమలత.పద్మారావు నగర్ లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్ హేమలత మరియు టిఆరెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ పర్యటించారు. ప్రధానంగా సాయిబాబా దేవాలయం వెనకాల బస్తీలో నెలకొన్న డ్రైనేజి సమస్య, తాగునీటి సరఫరాలో మురుగు నీటి సరఫరా లాంటి సమస్యలను స్థానికులు టిఆరెస్ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా బస్తీలో వీధి దీపాలు వెలగడం లేదని, స్థానికంగా ఉన్న పార్కుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలకు ఉపయోగించే అవకాశం లేదని వారు తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పర్యటనలో పాల్గొన్న వాటర్ వర్క్స్ డిజిఎం వెంకట్ కు మరియు హార్టికల్చర్ ఆఫీసర్ రాఘవేంద్రరావు కు కార్పొరేటర్ సూచించారు. ఈ ప్రాంతంలో 8 లక్షల రూపాయల తో డ్రైనేజి పైప్ లైన్ మంజురు అయిందని పనులను శుక్రవారంనాడు ప్రారంభిస్తామని వాటర్ వర్క్స్ అధికారులు వివరించారు. దీనితో కలుషిత నీరు సరఫరా సమస్య పరిష్కారం అవుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆరెస్ నాయకులు ఏసురి మహేష్ , డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ రాజు, శ్రీకాంత్ రెడ్డి, హరిచరి, సుధాకర్ రెడ్డి, మహేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ముక్క శ్రీనివాస్, పాల్గొన్నారు.

## హుజూరాబాద్ ఉపఎన్నికను భాజపా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముమ్మరంగా ప్రచారం





బాలాపూర్:అక్టోబర్26,ప్రజాపాలన (ప్రతినిధి) : అక్టోబర్ 30న జరిగే ధర్మయుద్ధంలో ఈటల రాజేందర్ ని అత్యధిక మేజార్టీతో గెలిపించాలని కేంద్రమంత్రి జీ. కిషన్ రెడ్డి హుజురాబాద్ ఓటర్లను కోరారు. మంగళవారం జమ్మికుంట మండలం వావిలాల, నాగంపేట్, కోరపల్లిలో జరిగిన రోడ్డుషో, బహిరంగ సభలో ఆయన టీఆర్ఎస్ సర్కారు, సీఎం కేసీఆర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరువ్యాపారం చేసి పైకి వచ్చిన ఈటెల రాజేందర్ పై సీఎం కేసీఆర్ కుటుంబం కుట్రలు చేస్తోందన్నారు. వేలా కోట్ల అక్రమ ఆస్తులు సీఎం కేసీఆర్ సహా కుటుంబ సభ్యులు ఏ వ్యాపారం చేసి కూడబెట్టారో ప్రజలకు జవాబు చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. కుటుంబ పాలనకు ఆత్మగౌరవానికి... ఆరాచకత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్న యుద్ధం అన్నారు. హుజూరాబాద్ లో జరుగుతున్న ప్రచారంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్, రాష్ట్ర నాయకులు ఎల్మేటి దేవేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, మాదారం రమేశ్ గౌడ్, మెహబత్ నగర్ శ్రీరాములు యాదవ్, బాలరాజు, బ్యాంకు డైరెక్టర్ పర్వతాలు, రఘువీర్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు అనితా, జీఎస్ ఇందిరా సహా బీజేపీ, బీజేవైఎం, మహిళా మోర్చా నాయకురాళ్లు, పాల్గొన్నారు. హుజూర్ బాదులో రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి మీర్ పేట్ మద్ది రాజశేఖర్ రెడ్డి, ఇంటింటి ప్రచారం చేసి ఈటల రాజేందర్ గెలిపించాలని కోరారు.

## సుందరయ్య నగర్ కాలనీ లో కెవిపిఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 26 ప్రజా పాలన ప్రతినిధి :బుధవారం రోజు అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీ 23 వ వార్డు సుందరయ్య నగర్ కాలనీలో కెవిపిఎస్ గ్రామ కమిటీ ఏర్పడింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీనియర్ నాయకులు శంకరయ్య సుందరయ్య కాలనీ గ్రామ కార్యదర్శి టి నరసింహ కెవిపిఎస్ జిల్లా నాయకులు ఇల్లూరి భాస్కర్ వీళ్లు మాట్లాడుతూ... భారతదేశ రూపురేఖలను మార్చిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని ప్రజలకు విద్య వైద్య స్వేచ్ఛ రాజ్యాంగం ద్వారా దళిత బహుజనులకు రిజర్వేషన్లు కల్పించాడని భారత రాజ్యాంగ... పితామహుడు అంబేద్కర్ ఏ నాని ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడడం జరిగింది ... కెవిపిఎస్ కొత్త గ్రామ కమిటీ. 21. మందితో ఏర్పడింది అధ్యక్షులు భీ. మాలాద్రి . ఉపాధ్యక్షులు. బి ఈశ్వర్. కే రవీందర్ రావు. గ్రామ ప్రధాన కార్యదర్శి. కె.సత్యనారాయణ సహాయ కార్యదర్శి. కె. కుమార్.పి. దావీదు. కోశాధికారి. కె. ఆదాము. కమిటీ సభ్యులు... డి విజయ్ కుమార్. ఎన్. రవి. బాలస్వామి ఇస్సాకు. మహేష్. డి అంజి బాబు. డీ జగన్ కె. రాజు .బి పేరయ్య. కే కృష్ణ. ఎం విజయ రావు. జి సాయిరాం. టీచర్ ఆదినారాయణ రెడ్డి. ఇంద్రజిత్తు. బ్రహ్మయ్య. చెన్నయ్య. ఆనంద్. తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ సిబ్బందిని సన్మానించిన బండ లింగారెడ్డి



కొడిమ్యాల, అక్టోబర్ 27 (ప్రజాపాలన ప్రతినిధి): కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామంలో బుధవారం లయన్స్ క్లబ్ కొడిమ్యాల మండలాధ్యక్షులు బండ లింగారెడ్డి ఆధ్వర్యంలో వంద కోట్ల వ్యాక్సినేషన్ పూర్తయిన సందర్బంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సిబ్బందిని కోవిడ్-19 కష్టకాలంలో చేసిన సేవలను గుర్తించి వారందరినీ పూడూర్ హెల్త్ సెంటర్ లో సన్మానించడం జరిగింది. ఈకార్యక్రమం లో లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు భూషణ్ రెడ్డి, సంతోష్, మల్లేశం, అమరేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మనోహర్, రమేష్, పూడూర్ సింగల్ విండో చైర్మెన్ బండ రవీందర్ రెడ్డి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పిడుగుపాటు కు గు గురైన కుటుంబానికి ప్రభుత్వ ప్రమాద చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



జగిత్యాల, అక్టోబర్,27 ( ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల మండల లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దళిత యువకుడు నక్క హరీష్ గత వర్షాకాలం పిడుగుపాటుకు గురై మరణించగా ప్రభుత్వం ద్వారా మంజూరైన 6 లక్షల విలువగల ప్రొసీడింగ్ కాపీని హరీష్ తండ్రి లింగన్న ను ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అందజేసినారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రములో ముఖ్యమంత్రి అందరికి సంక్షేమ పథకాలు అందించాలనే దిశగానే కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఎఎంసి చైర్మన్ దామోదర్ రావు, రైతు బంధు మండల కన్వీనర్ రవీందర్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ సందీప్ రావు, ఆత్మ చైర్మన్ రాజిరెడ్డి, సర్పంచ్ చెరుకు జాన్,ఎంపీటీసీ సునీత లక్ష్మణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు నగేష్ గౌడ్, విడిసి చైర్మన్ స్వామిరెడ్డి, గ్రామస్తులు సత్తి రెడ్డి, రవి, రాజీ రెడ్డి, రాజేష్, విజయ్, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్యాక్స్, ఎఎంసి డైరెక్టర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న మేయర్లు జక్క వెంకట్ రెడ్డి సామల బుచ్చిరెడ్డి




మేడిపల్లి, అక్టోబర్27 (ప్రజాపాలన ప్రతినిధి) కార్మికశాఖ మంత్రివర్యులు చామాకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో అలియాబాద్లో జరిగిన మేడ్చల్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ సామల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీని బలపర్చి, ప్రజల నమ్మకాన్ని కాపాడాలని ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ టీఆర్ఎస్ ఇన్చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు,కో అప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు,యువజన విభాగం తదితరులుపాల్గొన్నారు.

## ఆరోగ్య లక్ష్మీ కమిటీ నియామకం...



బీరుపూర్, అక్టోబర్ 26 ప్రజాపాలన ప్రతినిధి) బీరుపూర్ మండల్ రేకులపల్లి గ్రామంలో ఆరోగ్య లక్ష్మి కమిటీని నియమించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రం 2లో సర్పంచ్ ఎలగందుల లక్ష్మి పర్యవేక్షణలో అంగన్వాడీ టీచర్ సుమలత ఆశ వర్కర్ మరియు బాలింతలు సమావేశమై ఆరోగ్య లక్ష్మి కమిటీని ఏర్పచుకున్నారు. కమిటీ చైర్మన్ గా సర్పంచ్ ఎలగందుల లక్ష్మి సభ్యులుగా సువర్ణదీప ఆశావర్కర్స్ గంధం ఐశ్వర్య గోదావరి శ్యామల టి. శ్రీకాంత్ (టీచర్ ) జాడి మల్లవ్వను నియమించారు. కిశోర బాలికగా నేతుల మధులతను కూడ కమిటీలోకి తీసుకున్నారు.

## గెల్లు శ్రీనివాస్ ను గెలిపించాలని ప్రచారం



జగిత్యాల, అక్టోబర్ 27 (ప్రజాపాలన ప్రతినిధి): హుజురాబాద్ తెరాస అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ కు మద్దతగా జమ్మికుంట పట్టణంలో ప్రచారం నిర్వహించిన తెరాస రాష్ట్ర నాయకులు గొల్లపల్లి ఫ్యాక్స్ చైర్మన్ రాజసుమన్ రావు తెరాస జగిత్యాల విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఠాకూర్ ప్రభాత్ సింగ్ గొల్లపల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడు గంగాధర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## ఆత్మకథలు - కథనాలు

పేదరికం అనేది ఇతరులు చూసే చూపుకు సంబంధించింది. ఉదాహరణకి ఆదివాసి గిరిజనులు జీవించే జీవితం వారికి పేదరికం అనిపించదు. సహజమనిపిస్తుంది. ఆ జీవితం ఎంత హృద్యంగా ఉంటుందో జ్ఞానపీఠ్ అవార్డు పొందిన ఒరియా రచయిత గోపీనాథ్ మహంతి 'పరజ' (అమృత సంతానం) అనే నవలలో 1948లో చిత్రించాడు. నిసర్గ సౌందర్య గ్రామీణ అరణ్య ప్రజల జీవితాల్లోని ఆనందాలు, మైదాన ప్రాంతాలవాళ్ళు తెచ్చిపెట్టే కష్టాల గురించి అనేక కథలు, నవలలు, సినిమాలు వచ్చాయి. ఫణికుమార్, అంగలకుర్తి విద్యాసాగర్, బి.డి. శర్మ వంటి ఎందరో వారి జీవన చిత్రాలు చిత్రించారు. సింధ్‌బాద్ నావికుడి సాహసాలు అన్నీ కష్టాలతో కూడుకున్నవే. అరబీ సాహిత్యంలో పేరెన్నికగన్న వెయ్యిన్నొక్క రాత్రులు కథలు, సాహసాలు, కష్టాలు, విజయాలతో కూడుకున్నవే.

ఏ జీవితంలోనైనా కొన్ని సాహసాలు ఉంటాయి. కష్టాలు ఉంటాయి. ఆనందాలు, సాహసాలు ఉంటాయి. ఎంత బానిసత్వంలోనైనా కొన్ని సాహసాలు, ఆనందాలు ఎలా ఉంటాయో స్పార్టకస్, ఏడు తరాలు నవలల్లో చూడవచ్చు. అందుకే దాశరథి రంగాచార్య 'బతుకుపోరు' నవలను ప్రశంసిస్తూ చూడగలగాలే గానీ ఎండిన చెట్టులో కూడా అందం ఉంటుంది, సౌందర్యం ఉంటుంది అన్నాడు. అలాంటి పేదరికం నుండి అనేక అవమానాలు, వివక్షల నుండి రచయితగా, ఉద్యమ కార్యకర్తగా, బీసీ కమిషన్ ఛైర్మన్‌గా ఎదిగిన పరిణామాలకు పూర్వరంగం చెప్పకపోతే నా పునాదిని నేను మర్చిపోయినట్టు!. అలాంటి వాటిని బోర్ అని, అవసరం లేదని అనుకునే వారికి అలాంటి జీవిత పరిణామాల నుండి వచ్చిన వారిపట్ల అంతరంతరాల్లో ఎంతో వివక్ష ఉందని స్పష్టం చేసుకున్నట్టు!. వారు డిక్లాస్‌పై, డిక్యాస్ట్‌పై కాలేదని, సంస్కృతీకరణం చెందారని అర్థం. తెలంగాణాను సమర్థించే బొంత పురుగునైనా ముద్దు పెట్టుకుంటాను అన్నాడు కేసిఆర్. పేదలను ప్రేమించేవారు, పేద బాలబాలికల చీమిడిముక్కు, చిరిగిన మురికి బట్టల పిల్లలను కూడా ప్రేమిస్తారు. అలా నా బాల్యం నుంచి ఎదుగుతూ వచ్చిన స్నేహితులు చెడ్డీలు వేసుకోని కాలం నుంచి కలిసి జీవించిన బంధుమిత్రులు, వారి జీవిత పరిణామాలు బురదలోంచి పుట్టి పెరిగిన పద్మంలా, మొగిలి పువ్వులా వాళ్ళను గుర్తు చేసుకోవడం, రికార్డు చేయడం ఒక సామాజిక బాధ్యత. అందరూ రాయలేరు. అందుకని వాటిని రాయడం రచయితల కర్తవ్యం. అలా 'బి.ఎస్. రాములు 50వ జన్మదిన స్వర్ణోత్సవం' సందర్భాన్ని పురస్కరించుకొని ఎంతోమంది మిత్రులను కలిసి, గతాన్ని గుర్తు చేసుకొని, వాటిని రికార్డు చేయడం జరిగింది. అందులో కొన్నింటిని 50వ జన్మదిన సంచికలో చేర్చడం జరిగింది. ఈ సంచికగాను కొందరు మిత్రులను తమ అనుభవాలను, అనుభూతులను రాయమని కోరడం జరిగింది. చక్కగా చదువుకున్నాము. పెళ్ళి అయింది. పిల్లలయ్యారు. రిటైర్ అయ్యాము. హాయిగా ఉన్నాము, ఆనందంగా ఉన్నాము అంటూ రెండు మూడు పేజీలు గీకి ఇచ్చారు. ఆశ్చర్యమేసింది. ఆనాడు ఎదుర్కొన్న కష్టాలు, సంఘర్షణలు, స్నేహాలు రాయవచ్చు కదా అని గుర్తు చేశాను. అందుకు వాళ్ళు ఇచ్చిన జవాబు ఏమంటే .....

(మిగతాభాగం రేపటి సంచికలో..)

## అపరంజి మృతదేహానికి నివాళులర్పించిన టీఆర్ఎస్ నాయకులు



ఎర్రుపాలెం అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి:ఎర్రుపాలెం మండలం తక్కెళ్ల పాడు గ్రామంలో కూరపాటి సౌలు మాతృమూర్తి అపరంజి మరణించినారు. వారి భౌతిక కాయానికి ఖమ్మం జిల్లా దిశా కమిటీ సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డా. కోటా రాంబాబు నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రఘాడ సానుభూతి ని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోలీస్ ఎక్సైజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు



మధిర అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి : గంజాయిపై మధిర పోలీస్ మరియు ఎక్సైజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పలు అనుమానిత నివాసాల్లో అకస్మాత్తుగా దాడులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయా శాఖల సీఐలు మురళి, సిహెచ్ నాగేశ్వరావు మాట్లాడుతూ గంజాయ్ అమ్మి నా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. గంజాయి, గుడుంబా, గుట్కాలు తదితర నిషేధిత మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం నిర్ణయించడంతో మధిర సర్కిల్ పరిధిలో ఎక్సైజ్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ సతీష్ కుమార్ ట్రైన్ షకీర్ ఎక్సైజ్ ఎస్ఐ శార్వాణి తదితరులు పాల్గొన్నారు

## ఉప్పల్లో బ్యాంకుల బుణ విస్తరణ మహోత్సవం





మేడిపల్లి, అక్టోబర్27 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్లోని మేకల భారతి గార్డెన్స్ లో డిఎఫ్ఎస్ ఫైనాన్స్ సెంట్రల్ మినిస్టర్ మరియు తెలంగాణ ఎస్ ఎల్ వీ సీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుణ విస్తరణ కార్యక్రమం జరిగింది. లబ్ధిదారులకు వడ్డీ రేటుతో రుణాలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, అర్హులైన లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరగకుండా అన్ని బ్యాంకుల బ్యాంకింగ్ సేవలను ఒకే చోట స్టాల్స్ రూపంలో ఏర్పాటు చేశామని. గృహ రుణాలు, కార్ల రుణాలు వ్యవసాయ మరియు చదువుల పై రుణాలు పొందడానికి అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బ్యాంకింగ్ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శాంసన్ మరియు లీడు బ్యాంక్ మేనేజర్ కిషోర్ కుమార్ వివిధ బ్యాంకుల అధికారులు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న పీర్జాదిగూడ నాయకులు



మేడిపల్లి, అక్టోబర్27 (ప్రజాపాలన ప్రతినిధి) : కార్మికశాఖ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో అలియాబాద్లో నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ కొల్తూరు మహేష్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, మాడుగుల చంద్రారెడ్డి, బండారి రవీందర్, అలువాల దేవేందర్ గౌడ్, కొత్త శ్రీకాంత్ గౌడ్, బొడిగే కృష్ణ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. టీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు.

## విజయగర్జన సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన ఖైరతాబాద్ ఎం ఎల్ ఎ దానం నాగేందర్...







హైదరాబాద్(ప్రజాపాలన సిటీ బ్యూరో) :సోమాజిగూడ లోని జయ గార్డెన్ లో టి ఆర్ ఎస్ పార్టీ జెండాను ఖైరతాబాద్ ఎం ఎల్ ఎ దానం నాగేందర్ ఆవిష్కరించారు .ఖైరతాబాద్ నియోజకవర్గ టి ఆర్ ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 15 న వరంగల్ లో జరగబోయే విజయగర్జన సభలో కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు...మేయర్ గద్వాల విజయ లక్ష్మి, మాట్లాడుతూ నూతనంగా నియమితులైన అన్ని కమిటీల సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనన్ని పథకాలు తెలంగాణ లో అమలవుతున్నాయని వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లే భాధ్యత కార్యకర్తలదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు మేయర్ గద్వాల విజయ లక్ష్మి,, కార్పొరేటర్ లు వనం సంగీత యాదవ్,మన్నే కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు...

## హుజురాబాద్ ఎన్నికలలో గెలుపు టిఆరెస్‌దే : జూబ్లీహిల్స్ ఎం ఎల్ ఎ మాగంటి గోపీనాథ్



హైదరాబాద్(ప్రజాపాలన సిటీ బ్యూరో) :హుజురాబాద్ ఎన్నికలలో ప్రతిపక్షాలు ఎన్ని చీకటి ఒప్పందాలకు పాల్పడినా టి ఆర్ ఎస్ దే విజయమన్నారు జూబ్లీహిల్స్ ఎం ఎల్ ఎ మాగంటి గోపీనాథ్ .జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని టీఆరెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ లో 15 న జరగనున్న విజయ గర్జన సభకు నియోజకవర్గం నుండి వేల సంఖ్యలో కార్యకర్తలు హాజరవ్వాలని పిలుపునిచ్చారు...గెల్లు శ్రీనివాస్ ఒక గొప్ప ఉద్యమకారుడని,రేవంత్ రెడ్డి, బండి సంజయ్ లు చీకటి ఒప్పందానికి పాల్పడి ఎన్ని కుట్రలు చేసినా హుజురాబాద్ ఎన్నికల్లో టి ఆర్ ఎస్ దే విజయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియోద్దీన్, కార్పొరేటర్ లు రాజ్ కుమార్ పటేల్,దేదీప్య, వనం సంగీత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధం - వైజ్ఞానిక మార్గం పుస్తకం ఆవిష్కరణ

హైదరాబాద్ అక్టోబర్ 27 ప్రజాపాలన ప్రతినిధి: కె.కె.రాజా అంజన సంజన అనీల్ సిద్ధోజీ సుభాష్ లతా రాజా ఫౌండేషన్ చైతన్య ఆర్ట్ థియేటర్స్ అభినందనలతో 'బౌద్ధం–వైజ్ఞానిక మార్గం' అనే పుస్తక ఆవిష్కరణ జరుగుతుంది. ప్రముఖ రచయిత బౌద్ధధమ్మ విశ్లేషకులు టీవీ వ్యాఖ్యాత శత గ్రంధ కర్త బొర్రా గోవర్ధన్ రచించిన వందవ రచన 'బౌద్ధం – వైజ్ఞానిక మార్గం' పుస్తక ఆవిష్కరణ అక్టోబర్ 29 శుక్రవారం నాడు సాయంత్రం 6:30 గంటలకు రవీంద్ర భారతిలో జరుగుతుందన్నారు. డాక్టర్ వరప్రసాద్ రెడ్డి అంజనేయ రెడ్డి మల్లేపల్లి లక్ష్మయ్య మామిడి హరికృష్ణ ఈమని శివనాగిరెడ్డి మొదలగు వారు ఆత్మీయ అతిథులుగా హాజరవుతారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని ఆహ్వానం పలికారు లతా రాజా ఫౌండేషన్.

## సేవా సదనములోఅన్న వితరణ



మధిర అక్టోబర్ 27 ప్రజా పాలన ప్రతినిధి :లిబుర్రి దైవిక్ నయన్‌లి పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు లిబుర్రి రవి మనీషాలి ఈరోజు డాక్టర్ వసంతమ్మమర సేవా సదనము మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ఈరోజు అన్న వితరణ చేశారుఈ సందర్భంగా లిసేవా సదనము డైరెక్టర్ డాక్టర్ కే. శిలారామ్‌లి మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్ని దానాలలో అన్నదానం మిన్న అని మానసిక దివ్యాంగుల విద్యార్థులకు అన్నదానం నిర్వహించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమం సేవా సదనము సిబ్బంది పాల్గొన్నారు

## నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టివేత



బోనకల్, అక్టోబర్ 26 ప్రజాపాలన ప్రతినిధి: ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి గుట్కా ప్యాకెట్లు విక్రయాలపై కట్టడి చేయాలని ఆదేశించటం తో మధిర సి ఐ మురళి నేతృత్వంలో మధిర సర్కిల్ పరిధిలో 10 టిమ్స్ గా పోలీసులు బృందం ఏర్పడి మంగళవారం పాన్ షాపుల్లో చిల్లర దుకాణాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానం ఉన్న షాపుల్లో సిఐ మురళి స్వతహాగా వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోనకల్లు మండలం ముష్టి కుంట గ్రామంలో దోస పాటి శ్రీధర్ పై అనుమానం వచ్చి తన ఇంటిలో తనిఖీ చేయగా లక్షా 90 వేల విలువచేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ మురళి పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి, గుట్కా ప్యాకెట్లు అమ్మకాలు చేపడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ మురళీ పేర్కొన్నారు. ఈ తనిఖీలలో బోనకల్ ఎస్ఐ కొండలరావు, ట్రైనీ ఎస్సై సురేష్, ఏఎస్ఐ దొండపాటి వెంకట్ నారాయణ, బోనకల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


Ph : 040-23233989
SNEHA MACS Ltd.
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED."
E-mail : info.hyd@snehamacsltd.com
Visit us : www.snehamacsltd.com
బహుజన బ్యాంకు నిర్మాణం కోసం
రండి.. కదలి రండి...!
బహుజన ఆర్థికాభివృద్ధితోనే కులరహిత సమాజం ఏర్పడుతుంది. - డా॥ బి.ఆర్. అంబేద్కర్
గత 12 సం॥లగా డిపాజిట్ హోల్డర్లకు అధిక వడ్డీని ఇస్తూ...
30 వేల కుటుంబాలకు ఆర్థిక పరమైన సేవలను అందిస్తూ..
విజయవంతంగా ప్రగతిని సాధిస్తున్నాం.
SNEHA MACS LTD. SINCE 12 YEARS SUCCESSFUL
SNEHA GROUP OF ORGANISATIONS SNEHA CLUB 20 YEARS CELEBRATIONS
బహుజనులకు విజ్ఞప్తి
మీరు స్నేహ మాక్స్‌లో సభ్యులుగా చేరండి.
డిపాజిట్స్ చేయండి అధిక వడ్డీని పొందండి.
తోటి పేద బహుజనులకు సహరించండి.
స్నేహ పెన్షన్ స్కీమ్‌లో చేరండి
సంవత్సరానికి 11% వడ్డీ చొప్పున
ఒక లక్ష డిపాజిట్ పై రూ. 11,000/- పొందండి.
నెలవారి వడ్డీ కూడా పొందే సౌకర్యం.
మీ డిపాజిట్ 7 సం.లో రెట్టింపు
బహుజన బ్యాంకు నిర్మాణంలో భాగస్వామ్యంకై
రండి... కదలిరండి...!
జై ఫూలే జై భీమ్ జై బహుజన జై భారత్
Sn. డా॥ కె. శివ భాగ్యారావు బహుజన IRS - vrs
ఫౌండర్ & ఛైర్మన్
సంప్రదించండి
హైదరాబాద్ 7660027682 7842106355
పొన్నూరు 998991763
విజయవాడ 9000621111
తిరుపతి 9440077239
విశాఖపట్నం 0891-2791205 7660027696




# అమలాపాల్ సైకో కిల్లరా? పోలీసాఫీసరా?




తమిళం తెలుగులో అగ్ర హీరోల సరసన నటించింది అమలాపాల్. చరణ్ .. బన్ని లాంటి టాప్ హీరోలతో తెలుగులో ఆడిపాడింది. ఇటీవల ఆమె (ఆడై) అనే ప్రయోగాత్మక చిత్రంలో నగ్నంగా నటించి షాకిచ్చింది. ప్రయోగాలకు ఏమాత్రం వెరవని అమలా పాల్ ఇప్పుడు సైకో కిల్లర్ గా మారిపోయింది. అమ్మాయిల ఆర్గాన్స్ కోసం వరుస హత్యలు చేసే మాఫియా పని పట్టే పోలీసాఫీసర్ గా అమలాపాల్ నటిస్తోంది. సైకో కిల్లర్ గా వికృత పాత్రతో పాల్ సర్ ప్రైజ్ చేయబోతోందా? అనేది ఇందులో సస్పెన్స్ గా కనిపిస్తోంది. తాజాగా రిలీజ్ చేసిన మోషన్ పోస్టర్ రకరకాల సందిగ్ధతలకు తెర తీసింది. తనే నిర్మాతగా మారి ఆర్గాన్ కిల్లర్ స్టోరీ నేపథ్యంలో ఓ మూవీని అమలాపాల్ చేస్తోంది. తమిళంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కడవెర్ అని టైటిల్ ని నిర్ణయించారు. కడవెర్ అంటే శవం అని అర్థం. శవాల చుట్టూ జరిగే ఆర్గాన్ మాఫియా నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అమలా పాల్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై అమలా పాల్ ఈ మూవీని నటిస్తూ నిర్మిస్తోంది. అనూప్ ఎస్ ఫనికర్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ మోషన్ పోస్టర్ని తాజాగా రిలీజ్ చేశారు. ఆర్గాన్స్ తొలగించి కెమికల్ నింపిన జార్స్ పక్కన కూర్చుని తాపీగా టిఫిన్ చేస్తూ డేంజరస్ లుక్ తో కనిపిస్తున్న అమలాపాల్ స్టిల్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇందులో పాల్ ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్ గా నటిస్తోందని సమాచారం. సైకో పాథ్ ఆర్గాన్ మాఫియా థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ మూవీ థ్రిల్లర్ చిత్రాలని ఇష్టపడే ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకునేలా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని అమలా పాల్ తెలుగులోనూ విడుదల చేసేందుకు ప్లానింగ్ లో ఉన్నారని తెలిసింది.

# "రాధే శ్యామ్" వ్యూస్ పై క్లారిటీ ఇచ్చిన యూట్యూబ్.!




పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ [illegible] నటించిన లేటెస్ట్ అండ్ మోస్ట్ అవైటెడ్ భారీ చిత్రం "రాధే శ్యామ్" నుంచి రీసెంట్ [illegible] ప్రభాస్ బర్త్ డే సందర్భంగా చిత్ర యూనిట్ అవైటెడ్ టీజర్ కట్ ని రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. అలాగే దీనిని రిలీజ్ చేసిన తర్వాత నుంచే భారీ స్థాయి రెస్పాన్స్ ను అందుకొని టాలీవుడ్ హైయెస్ట్ వ్యూడ్ టీజర్ గా రికార్డు సెట్ చేసింది. కానీ తర్వాత ఉన్నట్టుండి టీజర్ వ్యూస్ ఒకే దగ్గర స్టక్ అయ్యిపోవడం వచ్చినవి కూడా తగ్గడం జరిగింది. మరి అభిమానులు అడిగిన ప్రశ్నకే యూట్యూబ్ టీం క్లారిటీ ఇచ్చింది. కొన్ని సార్లు యూట్యూబ్ వ్యూస్ కౌంట్ అప్డేట్ చెయ్యడం అనేది స్లో గా జరుగుతుంది అని అలాగే కొన్ని సందర్భాల్లో ఆలస్యం కూడా అవ్వొచ్చని తర్వాత అప్డేట్ చెయ్యడం జరుగుతుంది అని తెలిపారు. దీనితో రాధే శ్యామ్ టీజర్ రెస్పాన్స్ పై ఓ క్లారిటీ వచ్చినట్టే అని చెప్పాలి.

## కవర్ పేజీపై

# అవికా పింక్ మంటలు!



ఉయ్యాలా జంపాల చిత్రంతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన అవికా గోర్ కెరీర్ ఇక్కడ ఆశించినంత సాఫీగా సాగలేదు. తొలి సినిమాతో మంచి పెర్ఫార్మర్ గా నిరూపించుకున్నా అటుపై వచ్చిన అవకాశాలేవీ అమ్మడికి పెద్ద పీట వేయలేకపోయాయి. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండటం.. ఆన్ స్క్రీన్ మసాలా సన్నివేశాలకు నో చెప్పడం వంటి కారణాల వల్ల దర్శక నిర్మాతలు అవికను పెద్దగా ఎంకరేజ్ చేయలేదు. దీనికి తోడు బరువు పెరగడంతో కొంత డిప్రెషన్ లోకి వెళ్లాల్సొచ్చింది. కానీ ఇంతలోనే స్లిమ్ లుక్ కోసం అవిక చేసిన ప్రయత్నం ఫలించింది. ఇటీవల ఈ బ్యూటీ అల్ట్రా స్లిమ్ లుక్ యువతరంలో గుబులు పెంచుతోంది. అవిక వరుస ఫోటోషూట్లు హీట్ పెంచుతున్నాయి. ఇటీవలే అవిక నటించిన నెట్ అనే సినిమా ఓటీటీలో రిలీజ్ అయింది. కానీ ఫలితాలు ఆశించిన విధంగా రాలేదు. ప్రస్తుతం టాలీవుడ్ లో రెండు చిత్రాల్లో నటిస్తోంది. థాంక్యూలో అవిక రెండో నాయిక. నాగచైతన్య హీరోగా నటిస్తుండగా రాశీఖన్నా మెయిన్ లీడ్ లో కనిపిస్తుంది. విక్రమ్. కె. కుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం కాట్టి నటనకు ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. తాజాగా అవిక స్కిన్ టైట్ డ్రెస్ లతో ఫోటోషూట్ లో దూకుడు పెంచింది. బికినీ షూట్ తరహాలో చాలా రచ్చ చేసింది. ప్రఖ్యాత మ్యాగజైన్ కవర్ పేజీ కోసం పింక్ లుక్ లో కనిపించింది. గ్రాండియర్ లైఫ్ స్టైల్ కవర్ పేజీ కోసం అవికా రకరకాలుగా ఫోజులిచ్చింది. టాప్ లో పింక్ కలర్ షోల్డర్ లెస్ స్కిన్ టైట్ దుస్తుల్ని దరించింది.. అలాగే థై స్లిట్ బాటమ్ తో అగ్గి రాజేసింది. ప్రస్తుతం అవికా ఆశలన్నీ టాలీవుడ్ పైనే ఉంది. ఆన్ సెట్స్ లో ఉన్న చిత్రాలు రిలీజ్ అయితే విజయాలు దక్కితే తప్ప మరో ఛాన్స్ కష్టంగానే కనిపిస్తోంది.

# తమన్నాకు షాకిచ్చిన మాస్టర్ చెఫ్ నిర్వాహకులు



ప్రముఖ ఎంటర్ టైన్ మెంట్ చానెల్ జెమినీ టీవీలో 'మాస్టర్ చెఫ్' కార్యక్రమం ప్రసారమవుతున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ బ్యూటీ తమన్నా దీనికి హోస్ట్ గా చేస్తోంది. అయితే తమన్నాతో ఈ షోకు రేటింగ్ రాకపోవడం.. ఆమె యాంకరింగ్ అంతగా బాగా లేదన్న విమర్శల నేపథ్యంలో సడెన్ గా మాస్టర్ చెఫ్ నిర్వాహకులు తమన్నాను తొలగించి.. యాంకర్ అనసూయను తీసుకోవడం సంచలనమైంది. ఈ మార్పు చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించి పలు కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే మాస్టర్ చెఫ్ నిర్వాహకులు దీనిపై వివరణ ఇస్తూ ఓ ప్రెస్ నోట్ విడుదల చేశారు. 'మాస్టర్ చెఫ్'లో హోస్ట్ చేసేందుకు రూ. 2 కోట్ల రెమ్యూనరేషన్ ఇచ్చేలా తమన్నాతో అగ్రిమెంట్ చేసుకున్నామని నిర్వాహకులు తెలిపారు. జూన్ 24 నుంచి సెప్టెంబర్ చివరి వరకు మొత్తం 18 రోజులు షోకు హోస్ట్ గా వ్యవహరించేందుకు తమన్నాతో అగ్రిమెంట్ పై సంతకం చేశారని చెప్పారు. అయితే ఆమెకు ఇతర కమిట్ మెంట్ల వల్ల కేవలం 16 రోజులు మాత్రమే షూటింగ్ కు వచ్చారని.. రెండు రోజులు రాలేదని తెలిపారు. ఈ రెండు రోజులు ఆమె షూటింగ్ కు రాకపోవడం వల్ల 300 మంది టెక్నీషియన్లు పనిచేస్తోన్న తమకు రూ. 5 కోట్లకుపైగా నష్టం వచ్చిందిన వెల్లడించారు. ఆమెకు అప్పటికే రూ. 1.56 కోట్ల పేమెంట్ చేశామని.. చివరి రెండు రోజులు షూటింగ్ కూడా పూర్తి చేసి ఉంటే మిగిలిన పేమెంట్ చేసేవాళ్లమని తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం షూటింగ్ పూర్తి చేయకుండా సెకండ్ సీజన్ అడ్వాన్స్ కావాలని తమన్నా డిమాండ్ చేసిందని.. అసలు సెకండ్ సీజన్ కు ఆమెను తీసుకోవాలని తాము అనుకోలేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. తమన్నా అంశానికి సంబంధించి ఏ వార్త రాయాలన్న మీడియా తమను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# ప్రపంచంలోని ప్రతి ప్రతిష్టాత్మక అవార్డు ను పొందండి: మంచు లక్ష్మి



కేవలం తమిళ నాట మాత్రమే కాకుండా, యావత్ భారతావని సూపర్ స్టార్ అని పిలిచే హీరో రజినీకాంత్ అని చెప్పాలి. రజినీకాంత్ కి కేవలం భారత్ లో మాత్రమే కాకుండా విదేశాల్లో సైతం భారీగా అభిమానులు ఉన్నారు. సినిమాల్లో రజినీకాంత్ గత 40 ఏళ్లుగా కొనసాగుతున్న సంగతి అందరికీ తెలిసిందే. రజినీకాంత్ సినీ రంగం లో చేస్తున్న సేవలకు గానూ, కేంద్ర ప్రభుత్వం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ను అందజేయడం జరిగింది. ఈ మేరకు టాలీవుడ్ నుండి కూడా పలువురు ప్రముఖులు, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంచు ఫ్యామిలీ కి చెందిన మంచు లక్ష్మి సూపర్ స్టార్ రజినీకాంత్ కి అవార్డ్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చిన్నప్పటి నుండి మిమ్మల్ని చూస్తున్నాను అని అన్నారు. సూపర్ స్టార్ అంకుల్ గా చూస్తున్నా అని అన్నారు. అందరికీ ప్రేరణ గా ఎంతో ఎత్తులో ఉన్నారు అని, మీరు గొప్ప నటుడు, గొప్ప మనిషి అంటూ చెప్పుకొచ్చారు. అంతేకాక ప్రపంచం లోని ప్రతి ప్రతిష్టాత్మక అవార్డు ను పొందండి అని వ్యాఖ్యానించారు.

# అనుష్క సమస్య బరువుతోనా.. పెళ్లితోనా?



స్వీటీ శెట్టి అలియాస్ అనుష్క శెట్టి ఇటీవల కొంతకాలంగా నటనకు దూరమైన సంగతి తెలిసిందే. నిశ్శబ్దం తర్వాత వేరొక సినిమాని ప్రకటించలేదు. అదే క్రమంలో గత కొద్దికాలంగా అనుష్కపై రకరకాల రూమర్లు పుట్టుకొచ్చాయి. స్వీటీ ఇంకా అధిక బరువు సమస్యల నుంచి బయటపడలేకపోతోందని అలాగే వయసు 35బార్డర్ క్రాస్ చేయడంతో ఇక ఇంట్లో వాళ్లు పెళ్లి చేసేయాలని భావిస్తున్నారని కూడా కథనాలొచ్చాయి. ఏదేమైనా నటనకు ఇప్పుడు అనుష్క పూర్తిగా దూరంగా ఉంది. నిజానికి బాహుబలి స్టార్ గా అనుష్క శెట్టి వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీ అవుతుందని అటుపై హిందీ పరిశ్రమకు వెళుతుందని కూడా అభిమానులు భావించారు. కానీ అవేవీ నిజాలు కాలేదు. అప్పటికి సైజ్ జీరో కోసం పెరిగిన అధిక బరువు నుంచి బయటపడేందుకు రకరకాల నేచురల్ చికిత్సావిధానాలను అనుసరిస్తోందని కూడా కథనాలు వైరల్ అయ్యాయి. ఆ క్రమంలోనే వేరే సినిమాలకు అనుష్క శెట్టి సంతకాలు చేయలేదు. ఇటీవలే స్వీటీ మారిన రూపం అంటూ స్లిమ్ లుక్ తో ఉన్న ఫోటోలు వైరల్ కాగా అభిమానుల నుంచి వాటికి అద్భుత స్పందన వచ్చింది. అయితే బరువు అప్పటికి పూర్తిగా తగ్గిపోలేదు. తాజా సమాచారం మేరకు అనుష్క బరువు తగ్గినట్లు సమాచారం. ఆమె మునుపటి కంటే ఫిట్ గా కనిపిస్తోంది. అలాగని ఇప్పటికిప్పుడు సన్నగా తయారైందని అర్థం కాదు. స్లిమ్ లుక్ ని సాధించడానికి ఇంకా చాలా సమయం పడుతుందట. కాకపోతే మునుపటితో పోలిస్తే తన రూపం మెరుగ్గా కనిపిస్తోందట. ఒకవేళ ఇదే నిజమైతే.. నటనను పూర్తిగా విస్మరించకుండా ఏదైనా సినిమాకి సంతకం చేయాలని తన అభిమానులు కోరుకుంటున్నారు. మరి అనుష్క మైండ్ లో ఏం ఉంది? అన్నది తెలియాల్సి ఉంది. ఈ లాక్ డౌన్ సమయంలో అనుష్క నటించే సినిమాల ప్రకటన ఉంటుందని ప్రచారమైనా ఎలాంటి ప్రకటనా లేదు. కరోనా క్రైసిస్ లో తన కుటుంబ సభ్యులతోనే అనుష్క ఉన్నారు. భాగమతి తర్వాత యువి క్రియేషన్స్ లో కమిట్ మెంట్ ని అనుష్క పూర్తి చేయాల్సి ఉంటుందని సమాచారం.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989